Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 3 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 జనవరి 2024 శనివారం పేజీలు : 4

## అయోధ్యలో దర్శన సమయం పొడిగింపు

అయోధ్య : అయోధ్య రామమందిరానికి భక్తులు పోటెత్తుతూనే ఉన్నారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు దర్శన వేళలను పొడిగించారు. ఉదయం 6గంటల నుంచే బాల రాముడి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ పూజలు, దర్శనాలకు అనుమతించాలని ట్రస్టు నిర్ణయించింది.

మధ్యాహ్నం 12గంటలకు హారతి, భోగ్ కోసం 15 నిమిషాలు కేటాయించారు. ఇంతకుముందు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ దర్శనాలకు అనుమ తి ఉండేది. ఇందులో 2గంటలు విరామం ఇచ్చేవా రు. ఇక వాహనాల రాకపోకలను నియంత్రించడం లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులను మూసివేశారు.



# అట్టహాసంగా గణతంత్ర వేడుకలు

## త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి..

ఢిల్లీ: దేశ వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న ఉదయాన్నే జెండా ఆవిష్కరించారు. వేడుకలకి చీఫ్ గెస్ట్‌గా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌హాజరయ్యారు. ముర్ముతో కలిసి మాక్రాన్ సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేదిక వద్దకు వచ్చారు. దాదాపు 38 ఏళ్ల తరువాత గణతంత్ర వేడుకల్లో బగ్గీని వినియోగించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, నిర్మల సీతారామన్ తదితరులు హాజరయ్యారు. ఇవాళ ఉదయాన్నే జాతీయ వార్ మెమోరియల్‌ను ప్రధాని సందర్శించడం, నివాళులర్పించడంతో గణతంత్ర వేడుకలు ప్రారంభమయ్యాయి.

తరువాత సైనికుల కవాతు, శకటాల ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

**అయోధ్య రామమందిరం భారతీయుల విశ్వాసానికి ప్రతీక :** అయోధ్య రామమందిరం ప్రజల విశ్వాసానికి, న్యాయవ్యవస్థపై భారతీయులకు ఉన్న అపారమైన నమ్మకానికి ప్రతీకగా నిలిచే గొప్ప నిర్మాణమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అంతేకాక, అయోధ్య రామ మందిరం భారత నాగరిక వారసత్వానికి ఓ చిహ్నంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు దేశ పౌరులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్రపతి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగం రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కృషి, పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నారీ శక్తి వందన్ అధినియమ్ (చట్ట సభలో మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు) మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన ఓ సాధనమని అభిప్రాయపడ్డారు. బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌ను భారతరత్నతో గౌరవించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వెనకబడిన తరగతుల సంక్షేమానికి విశేష కృషి చేసిన కర్పూరి ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. జీ20 సదస్సుకు అత్యద్భుతంగా ఆతిథ్యం ఇవ్వడంతో అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి మరింత పెరిగిందని తెలిపారు. అంతరిక్ష పరిశోధన, ఐటీ రంగంలో భారత్ దూసుకెళుతోందని అన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలంటే దేశ ప్రజలంతా తమ బాధ్యతలను వంద శాతం నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు.

# గవర్నర్ పక్షపాత వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్: గవర్నర్ వ్యవహరిస్తున్న పక్షపాత వైఖరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం కొట్లాడిన దాసోజు శ్రవణ్, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణను గత ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తే.. రాజకీయపరమైన సంబంధాలు ఉన్నాయని చెప్పి వారి అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించారని విమర్శించారు. కానీ ఇప్పుడు ఒక పార్టీ అధ్యక్షులుగా ఉన్న కోదండరాంను ఎలా ఆమోదిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి లెటర్ రాగానే ఆగమేఘాల మీద ఎలా సంతకం చేశారో గవర్నర్ చెప్పాలని డిమాండ్ చేశారు. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న శ్రవణ్, సామాజిక ఉద్యమంలో పాల్గొన్న సత్యనారాయణకు రాజకీయ నేపథ్యం అడ్డంకి అయితే ఎన్నికల్లో పోటీచేసిన కోదండరాంను ఏరకంగా ఆమోదించారో ప్రజలకు గవర్నర్ వివరించాలన్నారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చే జీతంతో గవర్నర్ పనిచేస్తున్నారని, రాజ్‌భవన్ నడుస్తున్నదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. గవర్నర్ సీఎం రేవంత్ రెడ్డికి బాధ్యులు కాదని రాష్ట్ర ప్రజలకు బాధ్యులనే విషయం గుర్తుంచుకోవాలని హితవుపలికారు.

నాడు కనిపించిన రాజకీయ నేపథ్యానికి ఉన్న అభ్యంతరాలు నేడు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఫెవికాల్ బంధం మేరకు నిర్ణయం తీసుకున్నారా అనే విషయం చెప్పాలన్నారు. ఈ నామినేషన్ల అంగీకారం కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కును తెలియజేస్తుందని చెప్పారు.

**సర్పంచుల పదవీకాలం పొడిగించాలి..** సర్పంచుల పదవీకాలం పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున ఎన్నికైన సర్పంచుల పదవీకాలం పొడగించాలి.. కానీ ప్రత్యేక ఇన్‌చార్జీలను పెట్టవద్దొన్నారు. ప్రజాపాలన అంటే ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాలనచేయాలి కానీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఇంచార్జీలు కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసుకోవాలని చెప్పారు. కరోనా సమయంలో రెండేండ్లపాటు సర్పంచుల పరిపాలన సమయం పోయిందని, కాబట్టి పదవి కాలాన్ని ఆరు నెలలు లేదా సంవత్సరం మేర పొడిగించాలని లేదా ఎన్నికలు నిర్వహించే వరకు వారి కాలాన్ని పొడిగించాలన్నారు. కేవలం మంత్రులు అందుబాటులో లేరు, కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందుబాటులో లేరంటూ సర్పంచులు పూర్తిచేసిన కార్యక్రమాల ప్రారంభాన్ని కూడా ప్రభుత్వం అడ్డుకుంటున్నదని విమర్శించారు.

**నీచ మానవులు తమ బుద్ధి మారరు..** మంచి పదవిలో కూర్చోబెట్టినంత మాత్రాన నీచ మానవులు తమ బుద్ధి మారరని పెద్దలు ఎప్పుడో చెప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. రేవంత్ అహంకారం, వేకిలి వ్యవహారం చూస్తుంటే వాళ్లు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నామనుకుంటున్నారని



ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్సే ఇంకా అధికారంలో ఉన్నామనుకొని మమ్మల్ని ఆడిపోసుకుంటున్నారని విమర్శించారు. చేతనైతే ఎన్నికల్లో ఇచ్చిన 420 అమలుపర్చాలని సూచించారు. రాజకీయాల్లో ఇలాంటి కుసంస్కారం ఉన్న వ్యక్తులు ఉన్నప్పుడు ఇలాంటి విమర్శలు తప్పవన్నారు. ప్రజల దృష్టిని మరలచే ప్రయత్నాలు ఎన్ని చేసినా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేవరకు వెంటాడుతామని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు :** కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు ప్రజలందరికీ తెలుస్తున్నదని కేటీఆర్ అన్నారు. ఒకటే రోజు రాజీనామా చేసిన ఎమ్మెల్సీలకు ఒకటే బులిటిన్ ద్వారా రాజీనామా ఆమోదించారు. ఒకటే కోటా కింద ఉన్న ఎమ్మెల్సీలకు వేరువేరుగా ఎన్నికలు నిర్వహించారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో అమిత్ షాను కలవగానే ఒకే ఎన్నిక కాకుండా వేరువేరుగా ఎన్నికలు జరిగేటట్టు నిర్వహించారని చెప్పారు. ఒకేసారి ఎన్నిక జరిగితే ఒకటి బీఆర్ఎస్‌కి, మరొకటి కాంగ్రెస్‌కి వచ్చేదని తెలిపారు. బీజేపీ జాకీలు పెట్టి కాంగ్రెస్‌కి మద్దతుగా నిలుస్తున్నదని విమర్శించారు. ఇరు పార్టీల ఫెవికాల్ బంధమని ప్రజలకు తెలుస్తుందని చెప్పారు. బండి సంజయ్ కూడా మొన్న కాంగ్రెస్ బీజేపీ కొట్లాడుకోవద్దు బీఆర్ఎస్ అంతంచేద్దామన్నారు. నిన్న గుంపు మేస్త్రి కూడా అదే మాట అన్నారని గుర్తుచేశారు. కాగా, గణతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## కృష్ణాబోర్డుకు ప్రాజెక్టులు అప్పగిస్తే తెలంగాణకు నష్టం: కేసీఆర్

సిద్దిపేట: తెలంగాణ ప్రజల ఆశలన్నీ భారాస ఎంపీలపైనే ఉన్నాయని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో భారాస పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు, లోక్‌సభాపక్షనేత నామా నాగేశ్వరరావుతో పాటు ఎంపీలు, కేటీఆర్, హరీశ్‌రావు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

కేసీఆర్ మాట్లాడుతూ.. "అధికారంలో లేకపోయినా రాష్ట్రం



కోసం పనిచేసేది భారాస మాత్రమే. పార్లమెంట్‌లో భారాస గళం బలంగా వినిపించాలి. రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడాలి. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటి గురించి ప్రశ్నించాలి. కృష్ణాబోర్డుకు ప్రాజెక్టులు అప్పగిస్తే తెలంగాణకు నష్టం. ఆపరేషన్ మ్యానువల్, ప్రొటోకాల్ లేకుండా ప్రాజెక్టులు ఎలా తీసుకుంటారు. భారాస క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. ఎవరితో సంబంధం లేకుండా గట్టిగా పోరాడుదాం. త్వరలోనే నేను ప్రజల్లోకి వస్తా" అని తెలిపారు. ఉభయసభల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన వైఖరి, వ్యూహాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణలో నియంతృత్వ ధోరణికి ప్రజలు చరమగీతం పాడారు

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ తమిళిసై



హైదరాబాద్: మన రాజ్యాంగం ఎంతో మహోన్నతమైందని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఎంతో ముందుచూపుతో వ్యవహరించి దానిని తయారు చేశారని చెప్పారు. అన్ని వర్గాల ఆశలు, ఆశయాల సాధనకు రాజ్యాంగం తోడ్పడిందని వివరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ పతాకాన్ని ఆమె ఎగురవేశారు. అంతకుముందు గవర్నర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, అధికారులు స్వాగతం పలికారు. పోలీసులు, సైనికుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

**ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు :** మన దేశం.. భిన్న జాతులు, మతాలు, కులాల సమాహారమని తమిళిసై అన్నారు. అందరినీ ఐక్యం చేసి ఒకే జాతిగా నిలబెట్టిన ఘనత రాజ్యాంగానిదేనని చెప్పారు. "బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాజ్యాంగం మార్గదర్శకత్వంలో ముందుకెళ్లడం గర్వించదగ్గ విషయం. ఆ స్ఫూర్తికి భిన్నంగా పాలకులు ముందుకెళ్తే ప్రజలు ఊరుకోరు. గడిచిన పదేళ్లలో అలాగే వ్యవహరించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారానే రాష్ట్రం సాధించుకున్నాం. నియంతృత్వ ధోరణితో వెళ్లడాన్ని తెలంగాణ సమాజం సహించదు. ఎన్నికల్లో తీర్పు ద్వారా నియంతృత్వ ధోరణికి ప్రజలు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అహంకారం, నియంతృత్వం చెల్లదని విస్పష్టమైన తీర్పు ఇచ్చారు.

**ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలన్నదే లక్ష్యం :** విధ్వంసానికి గురైన వ్యవస్థలను పునర్ నిర్మించుకుంటున్నాం. రాజ్యాంగ స్ఫూర్తితో పరిపాలిస్తేనే పేదవాడికి అభివృద్ధి ఫలాలు అందుతాయి. ఏకపక్ష నిర్ణయాలు, నియంత పోకడలు ప్రజాస్వామ్యానికి శోభనివ్వవు. అన్ని వర్గాల ఆకాంక్షల మేరకు కొత్త ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలన్నదే లక్ష్యం. ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణ మొదలైంది. 'మహాలక్ష్మి' కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మిగతా గ్యారంటీలనూ అమలు చేస్తాం. గాడితప్పిన వ్యవస్థలను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీ పడేలా ప్రణాళికలు రచిస్తున్నాం.

**రూ. 2 లక్షల రుణమాఫీకి బ్యాంకులతో సంప్రదింపులు :** సంక్షేమంలో సరికొత్త అధ్యాయం లిఖించేలా కొత్త ప్రభుత్వ పాలన ఉంటుంది. యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాం. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన పూర్తి కాగానే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతాం. దీనిపై ఎలాంటి అపోహలకూ యువతకు లోనుకావొద్దు. దావోస్ సదస్సులో రూ. 40 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. ఇందుకు సీఎం, ఆయన బృందాన్ని అభినందిస్తున్నా. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

రూ. 2 లక్షల రుణమాఫీకి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ప్రజావాణి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసే యోచనలో ఉన్నాం" అని గవర్నర్ తెలిపారు.

## సంపాదకీయం

# ఆసిస్ గోల్డెన్ వీసా రద్దు... భారత్ కు ఎంత ఎఫెక్ట్?

ఇటీవల కాలంలో పలు దేశాలు వీసాల జారీ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విదేశీ విద్యార్థుల పర్మిట్ల విషయంలో కెనడా ప్రభుత్వం పరిమితులు విధించగా.. యూఎస్ ప్రభుత్వం వీసా ప్రాసెసింగ్ ఫీజులను భారీగ పెంచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గోల్డెన్ వీసాలను రద్దు చేసింది. దీంతో... భారతీయులపై ఈ ఎఫెక్ట్ ఎంత అనే చర్చ మొదలైంది. అవును... ప్రపంచంలోని పలు కీలక దేశాల్లో భారతీయులు అత్యధిక సంఖ్యలోనే ఉంటుంటారు. ఈ నేపథ్యంలో... అత్యధిక జనాభా ఉన్న దేశం అయిన భారత్ లో ఆయా దేశాలు తీసుకునే వీసాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది నిత్యం చర్చనీయాంశం అవుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో... ఆస్ట్రేలియా సర్కార్ తీసుకున్న గోల్డెన్ వీసాల రద్దు ఎఫెక్ట్ కూడా భారతీయులపై ఏ మేరకు ఉండొచ్చనే చర్చ మొదలైంది. దీనిపై నిపుణుల నుంచి స్పష్టత వస్తుంది. విదేశాలకు చెందిన సంపన్న పెట్టుబడిదారులు కొన్నేళ్ల పాటు తమ దేశంలో నివసించేందుకు వీలుగా "గోల్డెన్ వీసా"లను ఆయా దేశాల ప్రభుత్వాలు జారీ చేస్తుంటాయి. విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించే మార్గాల్లో ఇదొకటి! ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా కూడా విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు 2012 లో ఈ ప్రోగ్రాంని ప్రారంభించింది. దీని ప్రకారం... కనీసం 5 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేవారు ఈ వీసాతో ఐదేళ్ల పాటు అక్కడ ఉండొచ్చు. ఈ క్రమంలో ఈ ప్రోగ్రాం కింద సుమారు లక్ష మంది వరకూ విదేశీయులు ఆస్ట్రేలియాలో రెసిడెన్సీ దక్కించుకున్నారని ఆసిస్ హోంశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అయితే... ఇందులో సుమారు 85శాతం మంది చైనా మిలియనీర్లే కావడం గమనార్హం. అయితే, గత కొన్నేళ్లుగా ఈ ప్రోగ్రాంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగ... కొందరు విదేశీయులు అక్రమ సంపదను తరలించడానికి ఈ ప్రోగ్రాంను వాడుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ గోల్డెన్ వీసా ప్రోగ్రాంని రద్దు చేయాలని ఆసిస్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ మేరకు... వీటిని రద్దుచేస్తున్నట్లు ఆస్ట్రేలియా హోంమంత్రి క్లేర్ ఓ నీల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. వీటి స్థానంలో వృత్తి నిపుణులకు మరిన్ని ఎక్కువ వీసాలు జారీ చేయడంపైనే తమ ప్రభుత్వం దృష్టి సారించనుందని తెలిపారు. ఇలా ఆస్ట్రేలియా గోల్డెన్ వీసా ప్రోగ్రాంలను రద్దుచేసిన ప్రభావం భారత్ పై ఏ మేరకు ఉండబోతుందనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో... ఈ ప్రభావం భారతీయులపై తక్కువగానే ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కారణం... మొత్తం విదేశీ పెట్టుబడుల్లో భారత్ 17వ స్థానంలో ఉండటమే అని అంటున్నారు. మరోపక్క... వీటిస్థానంలో వృత్తి నిపుణుల వీసాలను పెంచుకోవాలని చూస్తున్న ఆలోచన భారత్ కు కలిసొస్తుందని భావిస్తున్నారు

# ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు..

**జాతీయ పతాకాన్ని ఎగురవేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్...**

**పోలీసుల గౌరవ వందనం, అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.**









జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఎంతో ముందంజలో ఉందని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శామీర్పేటలోని కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం గత సంవత్సర కాలంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేశారు. జిల్లాను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్ళి అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కలెక్టర్ గౌతమ్ ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులను కలెక్టర్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డి సి పి నిఖితపంత్ , జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, , జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, జిల్లా కలెక్టరేట్ ఏవో రాంమోహన్రావు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**భారత గణతంత్ర దినోత్సవం26 జనవరి, 2024**
**సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం**
**మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా**
**గౌ॥ శ్రీ. గౌతమ్ పోట్రు, ఐ.ఎ.ఎస్**
**కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ గారి**

సందేశము భారత 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు విచ్చేసిన జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మీడియా ప్రతినిధులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.

స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన మన భారతావని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మరియు అభివృద్ధి ఫలాలను అన్ని వర్గాలకు అందించడానికి గౌరవనీయులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి మహనీయులు రూపొందించిన రాజ్యాంగం ద్వారా 1950 జనవరి 26న, మన దేశాన్ని గణతంత్ర దేశంగా ప్రకటించుకున్న విషయం మీ అందరికీ తెలుసు. దేశ స్వాతంత్రం కోసం జీవితాలను పణంగాపెట్టిన ఎందరో త్యాగధనులకు జోహార్లు అర్పిస్తూ వారి త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని వినమ్రంగా తెలుపుకుంటున్నాను.

సమగ్ర అభివృద్ధి, మెరుగైన సేవలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించుచున్నది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల వద్ద నుండి అభయహస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారంటీల క్రింద లబ్ధి పొందడానికి జిల్లాలోని అన్ని గ్రామముల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. 28 డిసెంబర్ 2023 నుండి 6 జనవరి 2024 వరకు జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం మరియు చేయూత పథకముల క్రింద ప్రజల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించి కంప్యూటరీకరణ చేసి, పథకాల వారిగా వివరాలు ప్రభుత్వానికి సమర్పించడం జరిగినది.

ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం క్రింద బాలికలు, మహిళలు మరియు ట్రాన్స్ జెండర్స్ కు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిం ది. ఇప్పటి వరకు జిల్లాలో 1 కోటి 20 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవల సదుపాయాల విషయంలో ఏ వ్యక్తి ప్రాణాలు కోల్పోకూడదని ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం "రాజీవ్ ఆరోగ్యశ్రీ" అనే గొప్ప పథకాన్ని తిరిగి ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సేవలను మరింత విస్తృత పరిచే ఉద్దేశంతో 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం పొందేలా కొత్త పథకాన్ని ప్రారంభించడం జరిగింది.

**పరిశ్రమల శాఖ:** టీఎస్-ఐపాస్ 2014 చట్టం క్రింద జిల్లాలో ఇప్పటివరకు 6 వేల 277 ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివిధ శాఖల నుండి 10 వేల 793 అనుమతులు ఇప్పించడమైనది. ఇప్పటివరకు 12 వేల 774 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా మరియు భారీ పరిశ్రమలు 15 వేల 805 కోట్ల పెట్టుబడితో స్థాపించి 2 లక్షల 33 వేల 88 మందికి ఉపాధి కల్పించడం జరుగుతున్నది. నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసిన జనరల్ మరియు ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ రాయితీ, పన్ను రాయితీ, విద్యుత్ చార్జీ రాయితీ ఇవ్వడం జరుగుతున్నది. " టి-ఐడియా " పథకం క్రింద ఇప్పటివరకు 3 వేల 825 మంది పారిశ్రామికవేత్తలకు 450 కోట్ల 52 లక్షల రాయితీలు మరియు "టీ ప్రైడ్ పథకం" క్రింద ఇప్పటివరకు 2 వేల 731 పారిశ్రామికవేత్తలకు 142 కోట్ల 50లక్షల రాయితీలు మంజూరు చేయడం జరిగింది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా సూక్ష్మ పరిశ్రమలు స్థాపించుటకు బ్యాంకు ఋణముతో కూడిన సబ్సిడీ మంజూరు చేయబడుతున్నది. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 219 మంది దరఖాస్తులను ఎంపిక చేసి వివిధ బ్యాంకులకు పంపించడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 40 యూనిట్లకు గాను ఇప్పటివరకు 47 యూనిట్లు స్థాపించి బ్యాంకు ఋణం మంజూరు చేయడమైనది. వీటిలో 42 యూనిట్లు స్థాపించబడినవి.

**మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ:** జిల్లాలో 793 అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు తల్లులకు ఆహార మరియు ఆరోగ్య సేవలను అందిస్తూ పోషకాహార స్థాయిలను మెరుగుపరచడం జరుగుతున్నది. నిరాశ్రయులైన మహిళలకు వైద్య సేవలు, న్యాయసహాయం, తాత్కాలిక వసతి, కౌన్సిలింగ్, పోలీస్ సహాయం సేవలను అందించడానికి " సఖి " కేంద్రాలు మరియు మహిళా సంరక్షణ కేంద్రాలు పని చేయుచున్నవి. తక్షణ సహాయం కోసం 181 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సేవలను అందించుచున్నాము. తల్లిదండ్రులను కోల్పోయి నిరాశ్రయులైన పిల్లలకు, వారి సంరక్షణ మరియు రక్షణ కొరకు ప్రభుత్వం సైనిక్ పురిలోని బాలలసదనం నందు మరియు జిల్లా మొత్తం 78 పిల్లల సంరక్షణ కేంద్రాలను ప్రభుత్వ పర్యవేక్షణలో నడుస్తున్నాయి. తక్షణ సహాయం క్రింది టోల్ ఫ్రీ నంబరు ద్వారా 1098 సేవలను అందించడం జరుగుతున్నది. అదే విధంగా వికలాంగులకు,వృద్ధులకు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరాదరణకు గురైన వారికి ఆశ్రయం కల్పించుచున్నాము అర్హత కలిగిన వారికి దివ్యాంగ పరికరాలు మరియు ఋణ సదుపాయం కల్పించడం జరుగుతున్నది. పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించుచున్నాము.

**నీటిపారుదల శాఖ:** ప్రాజెక్టులు మరియు చిన్న నీటి వనరుల నిర్వహణ క్రింద 36 లక్షల రూపాయలు ఖర్చు చేసి 16 పనులకుగాను 10 పనులు పూర్తి చేయడం అయినది. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నవి.

విద్యా శాఖ: ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలలో పాఠ్యపు పుస్తకాలతో పాటు వారికి కావలసిన వ్రాత పుస్తకాలు మరియు ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్ లు అందించడం జరుగుతుంది.

పంచాయితీరాజ్ శాఖ: జిల్లాలో ఉన్న 61 గ్రామపంచాయతీలలో అన్ని గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్యాంకర్లు, ట్రాలీలు కొనుగోలు చేయడమైనది. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో వైకుంఠధామాల నిర్మాణము, కంపోస్ట్ షెడ్డు నిర్మాణము చేయబడి ఉపయోగించబడుతున్నవి. ప్రతి గ్రామంలో హరితహారం మొక్కల నర్సరీ ఏర్పాటు చేయడమైనది. అంతేకాకుండా గ్రామపంచాయతీ పరిధిలో మరియు ఆటవీ శాఖ ద్వారా జిల్లాలో అన్ని ప్రాంతాలలో 72 లక్షల 83 వేల మొక్కలు నాటడం జరిగినది.

**జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ:** జిల్లాలో దారిద్రరేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలలోని వారికి ఆసరా కల్పించడానికి ఈ పథకం క్రింద ఈ జిల్లాలో ఒక లక్ష 46 వేల మందికి వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు నెలకు 2 వేల 16 రూపాయల చొప్పున మరియు వికలాంగులకు 4 వేల 16 రూపాయల చొప్పున ప్రతినెల 33 కోట్ల రూపాయలు చెల్లించడం జరుగుతున్నది. జిల్లాలో ఒక జిల్లా సమాఖ్య మరియు 5 మండల మహిళా సమాఖ్యలు, 118 గ్రామ సంఘాలు, 3 వేల 384 స్వయం సహాయక సంఘాలు, 36 వేల 624 మంది సభ్యులతో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా 2 వేల 597 సంఘాలకు 147 కోట్ల 80 లక్షల రూపాయల ఋణాలు మంజూరు చేయడం జరిగింది. జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్, " ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం" కింద జిల్లాలో 34 మంది లబ్ధిదారులకు 35 శాతం క్రెడిట్ సబ్సిడీ లోన్స్ ద్వారా 63 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కొత్తగా ఏర్పడిన 61 గ్రామపంచాయతీలతో కూడిన 5 మండలాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయబడుతున్నది. ఈ పథకం క్రింద 17 వేల 847 జాబ్ కార్డ్స్ జారీ చేసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరములో 71 వేల 64 పని దినములు కల్పించి 1కోటి 82 లక్షల రూపాయలు కూలీలకు వేతన రూపంలో చెల్లించడం జరిగింది.

**పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1051 స్వయం సహాయక సంఘాలకు 105 కోట్ల 23 లక్షల రూపాయలు బ్యాంకు లింకేజీ ఋణాలు మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా స్వయం ఉపాధి పథకం క్రింద 47 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు 48 లక్షల రూపాయల వ్యక్తిగత ఋణం ఇప్పించడమైనది. ప్రధానమంత్రి వీధి వ్యాపారుల "ఆత్మ నిర్భర్ నిధి పథకం" ద్వారా ఇప్పటివరకు 18 వేల 222 మంది వీధి వ్యాపారులకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున మొదటి విడత బ్యాంకు ఋణం మంజూరు చేయడం జరిగింది.

**రహదారులు మరియు భవనముల శాఖ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరములో జిల్లాలో సుమారు 26 కోట్ల 17 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 15 పీరియాడికాల్ రెన్యూవల్ పనులు మంజూరు చేయబడి 14 పనులు పూర్తి చేయబడినవి. మరియు ఒకపని పురోగతిలో ఉన్నది. 77 కోట్ల 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము యొక్క నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నవి మరియు 23 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఘట్కేసర్ రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నవి. రెండు పడక గదుల ఇళ్ళ నిర్మాణము పథకం క్రింద జిల్లాలో రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ మరియు జిహెచ్ఎంసి శాఖ ద్వారా మొత్తం 39 వేల 593 ఇళ్లు మంజూరు చేయబడి 30 వేల 733 ఇళ్లు పూర్తి చేయబడినవి. వాటిలో 29 వేల ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించబడినవి.

**సహకార శాఖ:** జిల్లాలో ఇప్పటివరకు 1175 సహకార సంఘాలు రిజిస్టర్ చేయబడినవి. అంతేకాకుండా జిల్లాలో 5ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘములు మరియు నాలుగు రైతు సేవా సహకార సంఘములు పనిచేయుచున్నవి. ఈ సంఘాలలో రైతులకు ఋణ పంపిణీ, ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయం, ధాన్యం సేకరణ మరియు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ: పశువులకు మేత అవసరాల నిమిత్తం 9 మెట్రిక్ టన్నుల మేలు జాతి గడ్డి విత్తనములు 75 శాతం సబ్సిడీపై 616 సన్న మరియు చిన్నకారు రైతులకు సుమారు 8 లక్షల రూపాయలతో సరఫరా చేయడం జరిగింది. అదేవిధంగా గొర్రెల అభివృద్ధి కొరకు ప్రత్యేక ప్యాకేజీ ఫేస్-II క్రింద 2 కోట్ల 28 లక్షలతో 130 గొర్రెల యూనిట్లు 75శాతం సబ్సిడీపై గొల్ల కురుమలకు పంపిణీ చేయడం జరిగింది. పశువులకు అత్యవసర పశువైద్య సేవలు అందించేందుకు, జిల్లాలో రెండు సంచార పశు వైద్యశాలలు ఏర్పాటు చేయడం జరిగింది.

**విద్యుత్ శాఖ:** జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 38 కోట్ల 10 లక్షల రూపాయిలతో (6) 33/11kv ఉపకేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా 20 కోట్ల 24 లక్షల రూపాయల వ్యయంతో 2 వేల 857 వ్యవసాయ పంప్ సెట్ లకు విద్యుత్ కనెక్షన్లు మరియు గృహా, వాణిజ్య మరియు పరిశ్రమ రంగంలో 6 లక్షల 6 వేల 808 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. అదే విధంగా 99 కోట్ల 80 లక్షల రూపాయల వ్యయంతో 3 వేల 193 విద్యుత్ పంపిణీ నియంత్రికల సామర్థ్యం పెంచడం జరిగింది. 24 గంటలు నిరంతరాయ విద్యుత్ పంపిణీ అన్ని రకాల విద్యుత్ వినియోగదారులకు ఇవ్వడం జరుగుతున్నది.

**వ్యవసాయ మరియు ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖలు:** వ్యవసాయాన్ని లాభసాటిగా అభివృద్ధి చేయుటకై వివిధ చర్యలు చేపట్టడం జరుగుతున్నది. పంటల ఉత్పత్తికి కావలసిన నాణ్యమైన ఎరువులు, విత్తనములు తగు సమయానికి సమకూర్చడం జరుగుతున్నది. వ్యవసాయ పంటల ఉత్పత్తిలో సహాయపడుటకు సాంకేతిక శిక్షణలు రైతు వేదికల ద్వారా నిర్వహించడం, క్షేత్రస్థాయిలో పంటల వివరాల నమోదు కార్యక్రమం ద్వారా రైతులకు తగు సూచనలు అందజేస్తూ నిరంతరం వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండటం జరుగుతున్నది. ప్రస్తుత యాసంగి సీజన్లో 48 వేల 72 మంది రైతులకు 39 కోట్ల 92 లక్షల రూపాయలు రైతుబంధు పథకం కింద ఆర్థిక సహాయం ఇవ్వడం జరుగుతున్నది. అదేవిధంగా రైతు భీమా పథకం ద్వారా 499 మంది చనిపోయిన రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున మొత్తము 24 కోట్ల 95 లక్షల రూపాయలు నేరుగా వారి వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగింది. ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ ద్వారా తోటల విస్తరణ పథకంలో భాగంగా ఇప్పటివరకు 31 హెక్టర్లకు గాను 35 మంది రైతులను ఎంపిక చేయడం జరిగింది. రక్షిత సాగు మల్చింగ్ పథకం క్రింద నీటిని సమర్థవంతంగా వినియోగించుట కొరకు మరియు కలుపు నివారణకు ఉపయోగపడే మల్చింగ్ షీట్ కొరకు హెక్టారుకు 16 వేల రూపాయల చొప్పున రైతుకు 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది.

**ఇంటర్మీడియట్ విద్యా శాఖ**: జిల్లాలో 6 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పనిచేయుచున్నవి. అన్ని కళాశాలలోనూ ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేయుచున్నది. డిజిటల్ పద్ధతి ద్వారా తరగతులను నిర్వహించడం జరుగుతున్నది మరియు ఎంసెట్ కు ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించడం జరుగుతున్నది. గత సంవత్సరంలో 75% ఉత్తీర్ణత సాధించినారు.

**సంక్షేమ శాఖ:** జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 46 సంక్షేమ వసతి గృహములు పనిచేయుచున్నవి. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ద్వారా 91 మంది ఎస్సీ మరియు ఎస్టీ విద్యార్థులకు 5 కోట్ల 85 లక్షలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సంవత్సరం 10 వేల 791 మంది ఎస్సీ మరియు గిరిజన విద్యార్థులకు సుమారు 33 కోట్ల 42 లక్షల రూపాయలను స్కాలర్ షిప్ ద్వారా అందజేయడమైనది. ఉన్నత చదువులు చదువుచున్న 21 వేల 579 మంది ఎస్సీ విద్యార్థులకు మెయింటినెన్స్ చార్జీలు మరియు ఫీజు రియంబర్స్ మెంట్ క్రింద 83 కోట్ల 28 లక్షలు రూపాయలను మంజూరు చేయడమైనది. విదేశీ విద్య అభ్యసిస్తున్న 18 మంది మైనార్టీ విద్యార్థులకు 3 కోట్ల 60 లక్షలు స్కాలర్షిప్ క్రింది మంజూరు చేయడమైనది. మహిళా సాధికారత కొరకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 696 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడమైనది. కులాంతర వివాహాలను ప్రోత్సహించే ఉద్దేశంతో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ద్వారా 8 మంది ఎస్సీ జంటలకు 20 లక్షల రూపాయల చొప్పున (3) సంవత్సరాలకు బ్యాంక్ లో ఫిక్సడ్ డిపాజిట్ చేయడం జరిగింది. షెడ్యూల్ కులాల సేవా, సహకార అభివృద్ధి సంస్థ ద్వారా సూక్ష్మ మరియు చిన్న తరహా ఉపాధి యూనిట్లు స్థాపించుట కొరకు 376 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం అందజేయు 50 వేల రూపాయల సబ్సిడీ, ఎస్సీ కార్పొరేషన్ నిధులు మరియు బ్యాంకు లోన్ క్రింద 92 లక్షల 50వేల మొత్తమును 71 మందికి వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరిగింది. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనములు ఫీజు రీయంబర్స్మెంట్ పథకము క్రింద 266 కోట్ల 84 లక్షల రూపాయలు ఖర్చు చేయడం అయినది. నాయి బ్రాహ్మణులు మరియు రజకులచే జిల్లాలో నిర్వహించబడుతున్న హేయర్ డ్రెస్సింగ్ సెలూన్లు, లాండ్రీ షాపులు మరియు ధోబి గాట్లకు ఉచిత విద్యుత్ పథకం కింద 7 వేల 452 మంది లబ్ధి పొందుతున్నారు.

వైద్య మరియు ఆరోగ్య శాఖ: జిల్లాలో అల్వాల్ లో 12 వందల పడకల టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుచున్నవి. మేడ్చల్ పట్టణంలో 100 పడకల మాత శిశు సంరక్షణ కేంద్రం, ఆసుపత్రి నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుచున్నవి. కూకట్ పల్లిలో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం కొరకు భూమి పూజ నిర్వహించబడినది. మన జిల్లాకు కొత్తగా 200 పడకల ప్రభుత్వ వైద్యశాల మంజూరు చేయబడినది. జిల్లాకు నాలుగు క్రొత్త పట్టణ ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయబడినవి. అనారోగ్యంతో మరియు తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువులకు సేవలు అందించడం కొరకు ఘట్కేసర్ పట్టణ ఆసుపత్రిలో న్యూ బోర్న్ స్టెబిలైజేషన్ యూనిట్ ప్రారంభించబడినది. మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడం కోసం ప్రవేశ పెట్టబడిన "ఆరోగ్య మహిళ " పథకంలో భాగంగా మన జిల్లాలో ఇప్పటివరకు 30 వేల 550 మంది మహిళలకు ఓపి సేవలు మరియు 25 వేల 393 మందికి రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది.

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుంది..

మన జిల్లాలో వెలుగొందుతున్న అతి పురాతనమైన కీసరగిరి రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి అన్ని విధాల కృషి చేస్తున్నాము. ఈ సంవత్సరం కూడా కీసరగిరిబ్రహ్మోత్సవాలను ఎప్పటిలాగే ఎంతో వైభవంగా భక్తీ, శ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించు కోవడానికి సన్నద్ధంఅవుతున్నాము.

తెలంగాణలో మన జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుటకు అందరు కలిసి మెలిసి సమాలోచనలు, సమీక్షలు చేసుకుంటూ జిల్లాను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి పథంలోనడిపిస్తూ ముందుకు వెళదామని, దానికి మీఅందరి సహాయ సహకారం ఉంటుందని ఆశిస్తూ....

**మన సిరులగిరి - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాజై భారత్**

# అదే వృథా.. అందని భగీరథ

పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణాన్ని తాగునీటి కష్టాలు వీడటం లేదు. రోజు విడిచి రోజు వదిలే పురపాలిక నీరు తరచూ మురికిగా మారుతుండటంతో ప్రజలకు శుద్ధజలం అందని ద్రాక్షగానే మారింది. పట్టణంలో మూడొంతుల జనాభాకే మిషన్ భగీరథ నీరందుతోంది. కొత్త కాలనీలు, శివారు ప్రాంతాల్లో ఇప్పటికీ పనులు కొనసాగుతున్నాయి. నీరందిస్తున్న చోట కూడా నిర్వహణపరమైన సమస్యలు వెంటాడుతున్నాయి.నిత్యం మరమ్మతులే..

పట్టణంలో 50 ఏళ్ల కిందట నిర్మించిన పైప్‌లైన్లు శిథిలం కాగా కొత్త నిర్మాణాలకు ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. పాత పైప్‌లైన్లలో ఎక్కువ భాగం విస్తరణ పనులతో రహదారి కిందకు వెళ్లిపోవడంతో లీకేజీల బెడద పెరిగింది. భారీ వాహనాలు వెళ్లిన ప్రతిసారీ పైపులు పగిలిపోవడం పరిపాటిగా మారింది. సాగర్‌రోడ్డు, ప్రగతినగర్, అమర్‌నగర్, వ్యవసాయ మార్కెట్ ప్రాంతం, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో పైపులకు మరమ్మతు చేయడంతోనే నీటి సరఫరా



విభాగం సమయం గడిచిపోతోంది. పురపాలిక పరిధిలో అధికారికంగా 9 వేల కుళాయి కనెక్షన్లు, అనధికారికంగా మరో వేయి కనెక్షన్లున్నాయి. మిషన్ భగీరథ కింద ఒక్కో ఇంటికి రెండు నుంచి మూడు వరకు కనెక్షన్లు ఇచ్చారు. అవసరం లేని వాణిజ్య ప్రాంతాల్లోనూ కుళాయిలు బిగించారు. వాటికి బిరడాలు బిగించక నీరు వృథాగా పారుతోంది. విలీన గ్రామాలైన చందపల్లి, రంగంపల్లి, బంధంపల్లిలతో మిషన్ భగీరథ పథకం కొంత మెరుగ్గా ఉంది.

ప్రత్యామ్నాయాలపై నిర్లక్ష్యం

పెద్దపల్లి పట్టణంలో నీటి ఎద్దడి రాకుండా పదేళ్ల కిందట పది బావులు తవ్వించారు. ఇందులో తాళ్లకుంటలోని బావి బురదతో నిండిపోయింది. ఇప్పలబావి, రంగంపల్లి ఉపకేంద్రాల బావులు నిరుపయోగంగా మారిపోయాయి. కుమ్మరిబావి ఒక్కటే ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని అందిస్తోంది. మిషన్ భగీరథ శుద్ధి కేంద్రం అందుబాటులోకి రాకముందు బొంపల్లి వద్ద నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేవారు. ఇప్పుడది నిరుపయోగంగా మారింది. ఈ పరిస్థితుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.

# కళ్ల ముందే అక్రమ కట్టడాలు

వేములవాడ : భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. మరికొందరు కాలువల పక్కన స్థలాలను కొనుగోలు చేసి కాలువలను కనుమరుగు చేస్తున్నారు. మరి కొందరు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. నిత్యం జిల్లా, మండల స్థాయి అధికారులు వెళ్లే రహదారుల పక్కనే జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.వేములవాడ పట్టణ శివారులోని మల్లారం రోడ్డులో ఏకంగా కాలువ పక్కన బఫర్‌జోన్ స్థలంతోపాటు కాలువనే ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో పిల్లర్లు వేసి నిర్మాణాలు చేస్తే మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇప్పుడు అదే ప్రాంతంలో ఏకంగా కాలువకు ఇరువైపులా గోడ నిర్మాణం చేపడుతున్నా మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేములవాడ మండలంలో చంద్రగిరి శివారులోని వేములవాడ-సిరిసిల్ల ప్రధాన రహదారిని ఆనుకొని కాలువను సగం ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టినా పట్టించుకునే నాథుడు లేదు. దీంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడుతున్నారు.

బఫర్ జోన్ స్థలమే కాదు..బఫర్ జోన్ స్థలాన్ని కాలువకు ఇరువైపులా గుర్తించి రికార్డుల్లో నమోదు చేస్తారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కాలువల వెంబడి బఫర్ జోన్ స్థలమే కాకుండా ఏకంగా కాలువనే కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. కొందరు తెలివిగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వాటిని ఆనుకొని ఉన్న కాలువను ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. మరి కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టి విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. 10 మీటర్ల వెడల్పుతో పారే కాలువకు ఇరువైపులా దాదాపు 9 మీటర్ల స్థలం బఫర్ జోన్‌గా, 10 మీటర్ల లోపు పారే కాలువకు 2 మీటర్లు



బఫర్ జోన్ స్థలం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ చాలా ప్రాంతాల్లో కాలువల బఫర్ జోన్‌తో పాటు కాలువలనే ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. వేములవాడ పట్టణ శివారులోని మల్లారం రోడ్డులో, చంద్రగిరి శివారులో బఫర్ జోన్ స్థలంతో పాటు కాలువనే ఆక్రమించి కట్టడాలు చేస్తున్నా పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తాఖీదు ఇచ్చాంచంద్రగిరి శివారులోని కాలువను ఆక్రమించి కట్టడాలు చేసిన వ్యక్తికి తాఖీదు జారీ చేశాం. మల్లారం రోడ్డులో కాలువలో నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలను ఉల్లంఘించి కాలువల్లో నిర్మాణాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.శ్రీనివాస్, నీటిపారుదలశాఖ డీఈ

# సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు







సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త): సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్లోని పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ముందుగా సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్., స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ జెండాను ఆవిష్కరించారు. 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 1950, జనవరి 26వ రోజున మనకు రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.మన స్వాతంత్ర సమరయోధులు తీసుకువచ్చిన రాజ్యాంగం ద్వారానే మనం ఇప్పుడు ఒక ప్రజాస్వామ్య దేశంగా అవతరించిందన్నారు. దేశం కోసం పోరాడిన ఎందరో మహానుభావుల త్యాగాలను స్మరించుకుంటూ ముందుకు సాగుదామన్నారు.రాజ్యాంగం ద్వారానే మనమంతా ఒక్కటిగా ఒకే దేశంలో ఉంటున్నామన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి కొన్ని చట్టాలు ఉంటాయి, ఆ చట్టల ద్వారానే ప్రజలందరూ ఒక క్రమమైన పద్ధతి ప్రకారం జీవిన విధానం కొనసాగిస్తున్నామన్నారు. పోలీసులు ప్రజల ధనమాన, ప్రాణాలకు రక్షణగా ఉంటారన్నారు. రాజ్యాంగ ప్రకారం ప్రతీ ఒక్క పౌరుడు చట్టాలను అనుసరించి ఆత్మగౌరవంతో జీవిస్తారన్నారు. పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటామని కంకణ బద్ధులవ్వాలన్నారు.ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ సేవలు కనబర్చిన 18 మంది పోలీస్ సిబ్బందికి అతి ఉత్కృష్ట సేవా పతకాలను సీపీ గారు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్., సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ సీపీ నారాయణ్ నాయక్, ఐపీఎస్., సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి, డీసీపీ అడ్మిన్ రవి చందన్ రెడ్డి, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఐపీఎస్., మాదాపూర్ డీసీపీ జి. వినీత్, ఐపీఎస్., శంషాబాద్ డీసీపీ శ్రీ నారాయణ రెడ్డి, ఐపీఎస్., రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఐపీఎస్., మేడ్చల్ డీసీపీ నితికా పంత్, ఐపీఎస్., ట్రాఫిక్ డిసిపి డివి శ్రీనివాసరావు, ఐపీఎస్., డీసీపీ సైబర్ క్రైమ్స్ కె. శిల్పవల్లి, విమన్ %డ% చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం, డీసీపీ అశోక్, రాజేంద్రనగర్ ఏడీసీపీ శ్రీమతి రష్మి పెరుమాళ్, ఐపీఎస్., మాదాపూర్ ఏడీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ ఏడీసీపీ ట్రాఫిక్ వేణుగోపాల్ రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీసీడబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాస్ రావు, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, సెక్షన్ల సిబ్బంది, పోలీసు సిబ్బంది,మరియు మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నీరిస్తేనే... పంట చేతికొచ్చేది!



సిరిసిల్ల : వానాకాలం సమృద్ధిగా వర్షాలు కురిశాయి. జిల్లా సాధారణ సగటు వర్షపాతం 833 మిల్లీమీటర్లకు 1072 మిల్లీమీటర్లు కురిసింది. అంటే సగటులో 29 శాతం అధికం. జలాశయాలు నిండుకుండలా మారాయి. దీంతో ఈ ఏడాది రెండు పంటలకు సాగు నీటికి ఢోకా లేదని అన్నదాతలు భావించారు. జిల్లా మెట్ట ప్రాంతం కావడం, అందులోనూ వేములవాడ నియోజకవర్గంలోని మూడు మండలాలు పూర్తిగా ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దీనికి ఎల్లంపల్లి జలాశయం వేమునూరు పంపుహౌస్ నుంచి నీరు రావాలి. వర్షాకాలం గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం కట్ట తెగింది. ఇక్కడ మరమ్మతులు ముందుకు సాగడం లేదు. ఈ యాసంగిలో ఫాజుల్‌నగర్ జలాశయానికి నీరు చేరితేనే నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎద్దడి కష్టాలు తీరుతాయి. ప్రస్తుతం చెరువుల్లోని నీటి నిల్వల ఆధారంగా వ్యవసాయ, బోరుబావుల కింద వరి సాగు చేశారు. బోరుబావులతో భూగర్భ జలాలను విరివిగా తోడటంతో డిసెంబరులోనే జిల్లా సగటు నీటి మట్టం 7.36 మీటర్లకు పడిపోయింది. రానున్న రోజుల్లో నీటి వినియోగం మరింత పెరుగుతుంది. జలాశయాల్లోకి నీటిని నింపడం ద్వారా ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంది.

ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం పరిధిలో జిల్లాలో 80 వేల ఎకరాలకు సాగు నీరందించాలనేది లక్ష్యం. చాలా చోట్ల పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రస్తుతం 60 వేల ఎకరాలకే నీరందుతుంది. 2018 నుంచి జలాశయాలు, వాటి కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీల నిర్వహణ లేదు. దీనికితోడు రెండేళ్లుగా వర్షాలకు చందుర్తి మండలం నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లిలోని ప్రధాన కాల్వలు కోతకు గురయ్యాయి. డిస్ట్రిబ్యూటరీలు పూడికతో నిండిపోయాయి. ఫాజుల్‌నగర్ జలాశయానికి నీటిని విడుదల చేసినా అక్కడి నుంచి కాల్వల ద్వారా ఆయకట్టుకు నీరు చేరడం గగనంగా మారుతుంది. అయితే ఈ సమస్యను ముందే గుర్తించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల నీటి విడుదలకు ప్రణాళికలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి నుంచి నీటి తరలింపులో జాప్యం జరిగితే పంట చేతికి రావడం కష్టంగా మారుతుంది.

ఫాజుల్‌నగర్‌కు చెందిన ఈ రైతు పేరు గుంటి మల్లేశం. జలాశయం కింద 3.32 ఎకరాలు ఉంది. యాసంగిలో పూర్తిగా వరి సాగు చేశారు. జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో కాల్వల ద్వారా నీరందడం లేదు. వారం క్రితం లక్ష రూపాయలు వెచ్చించి బావి తవ్వించారు. దానిలోని నీటిని మోటారు ద్వారా తోడితే మూడు గంటలకు మించి అందడం లేదని వాపోయారు.తుర్కపల్లికి చెందిన ఇతని పేరు ఉప్పరి భీమయ్య. ఫాజుల్‌నగర్ ప్రధాన కాల్వ కింద ఉన్న బోరు బావితో రెండెకరాలు వరి సాగు చేశారు. జలాశయంలో నీరు అడుగంటడంతో బోరు తక్కువగా పోస్తుంది. సకాలంలో జలాశయంలో నీటిని నింపితేనే చివరికి పంట చేతికందే పరిస్థితి అని చెబుతున్నారు.

జలాశయాలు నింపుతాం

ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం పరిధిలోని ఆయకట్టుకు నీరందించేందుకు నారాయణపూర్ జలాశయం నుంచి ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేశాం. త్వరలోనే వర్షాలకు కాల్వలు దెబ్బతిన్న చోట తాత్కాలిక మరమ్మతులు చేయిస్తాం. ఫాజుల్‌నగర్ జలాశయం నింపి దిగువన ఆయకట్టుకు నీరందిస్తాం. రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం.సంతుప్రకాశ్, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్టు

# నిర్మాణ వ్యర్థాలా.. ఫోన్ చేయండి

హైదరాబాద్ : నగరంలో నిర్మాణ వ్యర్థాల సేకరణకు 13 చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎంసీ తెలిపింది. ప్రైవేటు ఏజెన్సీలకు ఈ బాధ్యతను అప్పగించినట్లు వెల్లడించింది. నగరంలో నిర్మాణ వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా మారడంతో వీటి పునర్వినియోగం కోసం జీహెచ్‌ఎంసీ రెండు ప్లాంట్లను ఏర్పాటు చేసింది. జీడిమెట్ల, ఫతుల్లాగూడలో అవి ఉన్నాయి. ఒక్కో ప్లాంట్ సామర్థ్యం రోజుకు 500 టన్నులు. శంషాబాద్‌లో ఇటీవలే మూడో ప్లాంట్ పూర్తికావడంతో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. నాలుగో ప్లాంట్ పనులు పురోగతిలో ఉన్నాయి. నిర్మాణ వ్యర్థాలను చెరువుల్లో పడేయకుండా సేకరణ కేంద్రాల ద్వారా ప్లాంట్లకు తరలించాలని జీహెచ్‌ఎంసీ మేయర్, కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సేకరణ కేంద్రాలను రెండు సర్కిళ్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు.ఎక్కడెక్కడంటే.. హైటెక్‌సిటీ ఫ్లైఓవర్, గౌలిదొడ్డి, దేవేంద్రనగర్, షాపూర్‌నగర్, జీఎస్ఐ, అంబర్‌పేటలోని కేంద్రాలను 97054 33369 నెంబరులో సంప్రదించాలి.ఆరాంఘర్ చౌరస్తా, పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెం 55, పీపుల్స్ ప్లాజా, సాకేత్, ఫిరోజ్‌గాంధీ పార్కు, యాప్రాల్, పిట్టలబస్తీలో సేకరణ కేంద్రాలకు సంబంధించి 88857 37472/63020 74614 నంబర్లకు ఫోన్‌చేయాలి.టోల్ ఫ్రీ నంబర్లకు.. ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట, సంతోష్‌నగర్, అంబర్‌పేట, యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీపురం, పటాన్‌చెరు, మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఇంటి వద్దకే వచ్చి నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు 1800-120-1159 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చు. వాట్సాప్ నంబరు 91009 27073. చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్, కాప్రా, ముషీరాబాద్, ఖైరతాబాద్, అల్వాల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్ల పరిధిలో 1800-203-0033 టోల్‌ఫ్రీ నంబర్‌కు..వాట్సాప్ నంబర్ 73300 00203కు కాల్ చేయవచ్చు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఎ ఓ రమేష్

శామీర్ పేట, (గరుడ వార్త): ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను షామీర్పేట వ్యవసాయ అధికారి రమేష్ ను జిల్లా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ వ్యవసాయ అధికారిగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ రేట్ లో జరిగినటువంటి



కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా శామీర్ పేట మండల వ్యవసాయ అధికారి రమేష్ ఉత్తమ వ్యవసాయాధికారిగా ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఏ ఓ రమేష్ మాట్లాడుతూ...ప్రశంసా పత్రాన్ని అందుకోవడంలో ఆనందం వ్యక్తం చేసారు. వ్యవసాయ అధికారిగా రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తన బాధ్యతను నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు.

# గ్రామ గ్రామాన ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

శామీర్ పేట, (గరుడ వార్త) : తూముకుంట మున్సిపాలిటీ షామీర్పేట మూడు చింతలపల్లి మండలాల పరిధిలోని పట్టణ గ్రామ గ్రామాల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. శామీర్ పేట , మూడు చింతలపల్లి మండలాల తాసిల్దార్ కార్యాలయాల వద్ద ఎమ్మార్వోలు సత్యనారాయణ, వాణి రెడ్డి, మండల పరిషత్ కార్యా లయాల వద్ద వాణి, వస్తలా దేవిలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వద్ద వైద్యులు శ్రీకాంత్, దమయంతి, వ్యవసాయాధికారులు రమేష్, కృష్ణవేణి, శామీర్ పేట, జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్లు నిరంజన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సహకార సంఘం వద్ద చైర్మన్ మధుకర్ రెడ్డి, తూముకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ జైతురాం నాయక్ త్రివర్ణ పతాకాన్ని



ఆవిష్కరించారు. శామీర్ పేట సుభాష్ చంద్రబోస్ వద్ద చైతన్య, స్టార్ యువజన సంఘం సభ్యులు మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. అలియాబాద్ లో విద్యుత్ ఏఈ శ్రీనివాస్, శామీర్ పేట ఏఈ ఈ రమణారెడ్డి, ఆయా గ్రామాలలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తూముకుంట మున్సిపల్ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి నాగేష్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

# సైదన్న సన్నిధి.. సమస్యలే అన్నీ

నల్గొండ : జాన్‌పహాడ్ దర్గా ఆవరణ సమస్యల వలయంలో కూరుకుపోయింది. ఏటా జనవరి చివరి శుక్రవారం నిర్వహించే ఉర్సు వేడుకలకు కనీస ఏర్పాట్లు కరవయ్యాయి. ఆదాయం కోట్లలో వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించే విషయంలో దర్గా గుత్తేదారు వక్ఫ్‌బోర్డు యాజమాన్యం విఫలమైనట్లు భక్తులు ఆరోపిస్తున్నారు.

వసతుల్లేక.. అవస్థలు:

ప్రతి కందూరు నిర్వహించి విందు ఆరగించే దర్గా పరిసరాల్లో ఎక్కడా కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దర్గా ఆవరణలో ఎంగిలి విస్తర్లు, మిగిలిన అన్నం, మాంసపు వ్యర్థాలు పడేయడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దశాబ్దాల క్రితం భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో పలు సత్రాలు నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకొని విడిదికి ఉపయోగపడని విధంగా మారాయి. దర్గా పరిసరాల్లోని పవిత్ర సఫాయి బావి శిథిలావస్థకు చేరింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో బావిలోని నీరు సైతం కలుషితమవుతోంది. ఇటీవల సజ్జాపురం గ్రామానికి చెందిన దాత బావిలో పూడిక తీయించారు. సఫాయి బావి జలం పవిత్రతను కాపాడుతూ మురుగును తొలగించి శుద్ధ జలంతో నింపాలని, శాశ్వత స్నానపు గదులు, శౌచాలయాల చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం: మహమూద్, ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

దర్గా ఆవరణలో తాగునీరు, శౌచాలయాలు, స్నానపు గదులు, సత్రాల వంటి శాశ్వత సౌకర్యాల కల్పన కోసం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవోకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రావాల్సి ఉంది. భూగర్భ జలాలు పడిపోవడం, తాగునీటి బోర్లు సక్రమంగా నీటిని అందించకపోవడంతో ఈ ఏడాది ఉర్సు వేడుకలకు అదనంగా ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీరందిస్తాం. పారిశుద్ధ్య కార్మికుల కొరతతో కొన్ని ఇబ్బందులు పడుతున్నాం. శుక్రవారం నుంచి జరగనున్న ఉర్సు వేడుకల కోసం రూ.20 లక్షలు మంజూరు చేయాల్సిందిగా కోరాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

# అయోధ్యలో దర్శన సమయం పొడిగింపు

అయోధ్య : అయోధ్య రామమందిరానికి భక్తులు పోటెత్తుతూనే ఉన్నారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు దర్శన వేళలను పొడిగించారు. ఉదయం 6గంటల నుంచే బాల రాముడి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ పూజలు, దర్శనాలకు అనుమతించాలని ట్రస్టు నిర్ణయించింది. మధ్యాహ్నం 12గంటలకు హారతి, భోగ్ కోసం 15 నిమిషాలు కేటాయించారు. ఇంతకుముందు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ దర్శనాలకు అనుమతి ఉండేది. ఇందులో 2గంటలు విరామం ఇచ్చేవారు. ఇక వాహనాల రాకపోకలను నియంత్రించడంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులను మూసివేశారు.

# వానొస్తే.. నీరొస్తది

తాండూరు : రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు, రైళ్ల రాకపోకల వల్ల తలెత్తే ట్రాఫిక్ తదితర సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గేట్‌మెన్ రహిత రైల్వేగేట్ల కోసం అండర్‌బ్రిడ్జిల నిర్మాణం చేపడుతున్నారు. కాజీపేట నుంచి బల్లార్ష మార్గంలో రైల్వే ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో దాదాపు 10 వరకు అండర్‌బ్రిడ్జిల నిర్మాణాలు ఉన్నాయి. ఒక్కొక్క బ్రిడ్జికి దాదాపు రూ.3 నుంచి రూ.4 కోట్ల వరకు రైల్వేశాఖ వెచ్చిస్తోంది. కానీ ముందుచూపు లేక పంట పొలాలు, చెరువుల సమీపంలో నిర్మిస్తుండటంతో వర్షాలకు అండర్‌బ్రిడ్జిల్లో వరదనీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రాకపోకలు నిలిచిపోతున్నాయి. మళ్లీ ఆ వరద నీటిని తొలగించేందుకు మోటార్లను ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీనికితోడు భవిష్యత్తులో ఆ బ్రిడ్జిల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారుల ప్రణాళికలోపమే దీనికి కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ వరకు ఇప్పటి వరకు దాదాపు ఆరు అండర్ బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి కాగా, అన్నింటిల్లోనూ వరదనీటి సమస్య ఎదురవుతోంది.



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలోని ఎల్‌సీ76 రైల్వేగేటు(శివపూర్) వద్ద గేటును తొలగించి రూ.4 కోట్ల వ్యయంతో అండర్‌బ్రిడ్జి నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అండర్‌బ్రిడ్జి వరదతో నిండింది. రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటిని తొలగించేందుకు వెనుక భాగంలో నాలుగు స్టోరేజీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. వంతెన కింద వరదనీరు నిల్వ ఉండకుండా ఒక వైపు నుంచి పెద్దపైపుల ద్వారా ఆ నాలుగు స్టోరేజీ ట్యాంకులకు నీరు వెళుతుంది. చివరి స్టోరేజీ ట్యాంకులో నిల్వ ఉన్న నీటిని మోటార్ల ద్వారా తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే వర్షం తగ్గినప్పటికీ ఆ స్టోరేజీ ట్యాంకుల్లో ఊటనీరు ఉబికి వస్తుండటంతో.. మూడు మోటార్లతో 24 గంటల పాటు తొలగిస్తున్నప్పటికీ నీరు వస్తూనే ఉంది. తొలగించిన నీరు కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణాకాలనీలోకి చేరుతుంది. దీంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

శనివారం ఆ వంతెనను పరిశీలించగా.. మూడు మోటార్ల ద్వారా మూడు, నాలుగో నిల్వ ట్యాంకు నుంచి నీటిని తొలగిస్తున్నారు. చివరి ట్యాంకులో ఊటనీరు ఉబికి వస్తుందని, ఆ నీటిని మోటార్లతో తొలగించకుంటే ఆ నీరు కాస్త వంతెనలోకి వచ్చే అవకాశం ఉందని కార్మికులు తెలిపారు.

మంచిర్యాల జిల్లావాసుల ప్రధాన సమస్యల్లో ఒకటైన రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం ఇటీవల పూర్తయింది. పలు ఆటుపోట్ల మధ్య మొదలైన ఆ బ్రిడ్జి గత జూన్‌లో అందుబాటులోకి వచ్చింది. అధికారుల ప్రణాళిక లోపం.. ప్రజాప్రతినిధుల అలసత్వంతో చిన్నపాటి వర్షానికే బ్రిడ్జి కింద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. రెండునెలలుగా నీరు తొలగించకపోవడంతో సమస్య మళ్లీ మొదటి కొచ్చింది. పట్టణంలోని ముఖరాం చౌరస్తా నుంచి హమాలివాడ వైపు వరకు 100 మీటర్ల పొడవుతో గతేడాది ఏప్రిల్‌లో రూ.3.90 కోట్లతో పనులను ప్రారంభించారు. పనులు చకచకా సాగడంతో జూన్ నెలకు ముందే పనులు ముగిశాయి. కానీ తేలికపాటి వర్షానికే పట్టణవాసుల ఆశలు అడియాసలయ్యాయి. వర్షపు నీరు తొలిగినా.. బ్రిడ్జి గుండా రాకపోకలకు వీలు లేకుండా పోయింది. దారికి ఇరువైపులా ఇనుపకంచె వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మంచిర్యాల జిల్లా తాండూరు మండల పరిధిలో నాలుగు రైల్వే గేట్ల మార్గాలుండగా, ప్రస్తుతం మూడింటిని తొలగించి, కింద వంతెనలు నిర్మించారు. దాదాపు రూ.3 కోట్లు చొప్పున రూ.9 కోట్లు కేటాయించారు. నిర్మాణలోపం.. ఇతర కారణాలతో చిన్నపాటి వర్షం కురిసినా ఈ రెండు వంతెనల్లో ద్విచక్ర వాహనాలు మునిగి పోయేంతలా నీరు నిలుస్తోంది. అవి బయటకు వెళ్లేందుకు ఎటువంటి మార్గం లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. దీంతో మోటార్లతో నీటిని బయటికి పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండు మార్గాలే కాకుండా ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న తాండూరు గేటు వద్ద సైతం వరద వచ్చి చేరుతుంది. దీంతో మండల పరిధిలోని 20 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చెరువు సమీపంలోనే ఈ వంతెన నిర్మాణం చేపట్టడం వల్లే చెరువు నిండిన ప్రతీసారి ఇదే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణాలపై 'న్యూస్‌టుడే' సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా.. వారు సమాధానం చెప్పడానికి నిరాకరించారు.

# భూములిక సస్యశ్యామలం



మంచిర్యాల :కడెం ప్రధాన కాలువకు రెండు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉంటాయా గ్రామాలు. అయినా సాగు నీరందక అక్కడి భూములు బీళ్లుగా ఉంటాయి. చిన్నపాటి చెరువుల కింద కొంతమేర ఆయకట్టు సాగు మినహా మిగతా భూములకు నీరందని పరిస్థితి. తమ భూములు సాగయ్యేలా కడెం నుంచి ఎత్తిపోతల పథకం నిర్మించాలని అయిదు గ్రామాల రైతులు ఏళ్లుగా కోరుతూనే ఉన్నారు. వారి కల ఫలించేలా రెండు రోజుల కిందట లక్ష్మీపూర్ ఎత్తిపోతల పథకానికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

అయిదు గ్రామాలు.. మూడువేల ఎకరాలు..

కడెం మండలంలోని లక్ష్మీపూర్, నవాబుపేట, కల్లెడ, దోస్తునగర్, దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామాలకు సాగు నీటివసతి లేదు. వర్షాధార పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. చెరువుల కింద కొంతమేర సాగవుతుంది. మిగతా భూములకు నీరందక కొంత బీడుగా, మరికొంత మామిడి తోటలు పెడుతున్నారు. పక్క నుంచే కడెం ప్రధాన కాలువ వెళుతున్నా ఎత్తుగా ఉన్న తమ గ్రామాలకు నీరందని దుస్థితి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి తెదేపా, వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో చాలాసార్లు ఈ గ్రామాల రైతులు పాలకుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. సర్వేల వరకే జరిగినా ఎత్తిపోతల మంజూరు కార్యరూపం దాల్చలేదు.

తెరాస ప్రభుత్వం ఏర్పడ్డాక తమ సమస్యను తీర్చాలని ఈ గ్రామాల రైతులు స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి రాష్ట్ర మంత్రులను అనేక సందర్భాల్లో కలిసి విన్నవించుకున్నారు. లక్ష్మీపూర్ ఎత్తిపోతల సాధనకమిటీ పేరిట ఏర్పాటు చేసుకుని తమ సమస్యను తీర్చాలని కోరుతూ.. ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేను కలుస్తూ మంజూరయ్యేవరకు పట్టుపట్టారు. ఎమ్మెల్యే సైతం ఈ గ్రామాల రైతుల సాగునీటి సమస్య తీర్చేందుకు కృషిచేశారు. ఎట్టకేలకు ఈ నెల 11న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పొందడం, రెండు రోజుల కిందట రూ.40.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో.. ఈ గ్రామాల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు దిగువన పాండ్వాపూర్ వంతెన దగ్గర ఈ పథకాన్ని నిర్మించనున్నారు. అయిదు గ్రామాల్లోని ఎనిమిది చెరువులను నింపడంతో పాటు భూములకు నీరిచ్చేందుకు కావాల్సిన సర్వేలను ఇదివరకే అధికారులు పూర్తిచేశారు. త్వరలోనే సాంకేతిక(టెక్నికల్) అనుమతి పొందడం పూర్తయితే టెండర్లు పిలిచే అవకాశముంది. పైపులైను వేసేందుకు అటవీశాఖ అనుమతికి సైతం అధికారికంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. అయిదు గ్రామాలకు చెందిన మూడువేల ఎకరాలకు సాగు నీటినందించే ఈ పథకం త్వరగా కార్యరూపం దాల్చాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

ప్రక్రియ మొదలవుతుంది.. : – హంజానాయక్, డీఈ ఎత్తిపోతల పథకం

కేబినెట్ ఆమోదం పొందడం, నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం పూర్తయింది. ఇక సాంకేతిక అనుమతి రాగానే టెండరు ప్రక్రియ మొదలవుతుంది. ఇదివరకే సర్వేలు చేశాం. ఈ ఎత్తిపోతలతో అయిదు గ్రామాల్లోని ఎనిమిది చెరువులు నింపుతూ మూడువేల ఎకరాలకు సాగు నీటినివ్వగలుగుతాం. భూగర్భ జలాలు సైతం పెరుగుతాయి.

నిధుల మంజూరు సంతోషదాయకం : – వెంబడి తిరుపతి, ఎత్తిపోతల సాధనకమిటి అధ్యక్షుడు

ఈ ఎత్తిపోతల పథకం నిర్మించాలని 25ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతూనే ఉన్నాం. స్వరాష్ట్రంలో మా కల సాకారమవుతుందనే నమ్మకంతో కమిటీ ఏర్పాటు చేసుకుని అయిదు గ్రామాల రైతు నాయకులం ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి మంత్రులు, ఉన్నతాధికారులను తరుచూ కలిశాం. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. మా భూములు సస్యశ్యామలమవుతాయి.

# 'గిరి' విద్యార్థులు ఎక్కడ?

ఉట్నూరు : 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా' మారింది ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల పరిస్థితి. ప్రతికూల పరిస్థితుల మధ్య చదువుతున్న పేద ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలను మంజూరు చేస్తోంది. కళాశాలల యాజమాన్యాలు సకాలంలో విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలు(హార్డ్‌కాపీ)లు సమర్పించకపోవడంతో సదరు విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 5,309 మంది విద్యార్థుల హార్డ్‌కాపీలు సమర్పించలేదు. రూ.3 కోట్ల ఉపకార వేతన బడ్జెట్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో మూలుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ చదువులు, డీఎడ్, బీఎడ్, పాలిటెక్నిక్ తదితర వృత్తివిద్యా, సాంకేతిక కోర్సులు చేస్తున్న ఆదివాసీ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఉపకార వేతనాలను అందిస్తోంది. అందులో భాగంగా కోర్సు ఆధారంగా ఏడాదికి నిర్వహణ రుసుం(ఎంటీఎఫ్–మెయిన్‌టేనెన్స్–ఫీ), రీఎంబర్స్ మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ(ఆర్టీఎఫ్)పేర్లతో రెండు రకాల ఉపకార వేతనాలను అందిస్తోంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీతోపాటు ఆయా కోర్సులలో విద్యనభ్యసిస్తున్న 41,725 మంది ఆదివాసీ గిరిజన విద్యార్థులు 2017 నుంచి 2021 విద్యా సంవత్సరం వరకు ఎంటీఎఫ్, ఆర్టీఎఫ్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇప్పటి వరకు 36,416 మంది విద్యార్థులకు సంబంధించిన వివరాలు, హార్డ్‌కాపీలను ఆయా కళాశాలల యాజమాన్యాలు సమర్పించడంతో సదరు విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో ఉపకార వేతనాలు జమయ్యాయి. మిగతా 5,309 మంది విద్యార్థుల వివరాలు, వారి హార్డ్‌కాపీలను మాత్రం కళాశాలల యాజమాన్యాలు సమర్పించడం లేదు. అసలు ఆ విద్యార్థులు చదివారా లేక మధ్యలో మానేశారా అనే విషయంలో స్పష్టత కరవైంది. కళాశాలల నుంచి స్పందన కొరవడుతోంది.

నిండా నిర్లక్ష్యం..

ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు సంబంధించిన హార్డ్‌కాపీలు సమర్పించడంలో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయి. విద్యార్థి చదువుతున్న ప్రభుత్వ, లేదా ప్రైవేటు కళాశాల యాజమాన్యం తప్పనిసరిగా సదరు ఆదివాసీ, గిరిజన విద్యార్థి పూర్తి వివరాలు, 75 శాతం విద్యార్థి మీ సేవలో బయోమెట్రిక్ హాజరు నమోదు, లాగిన్ బల్క్‌ప్రింట్, కుల, ఆదాయ పత్రాలతోకూడిన హార్డ్ కాపీలను సంబంధిత గిరిజన సంక్షేమశాఖలో సమర్పించాల్సి ఉన్నా.. కళాశాలలు పట్టించుకోవడం లేదు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు పదేపదే చెబుతున్నా.. సదరు కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థులు ఉపకార వేతనాలకు దూరమవుతున్నారు.

పాలనాధికారి ఆదేశాలు బేఖాతరు..

ఆదివాసీ, గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాల బడ్జెట్ను సద్వినియోగం చేసుకోవాలని అందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల వివరాలు, హార్డ్‌కాపీలను గిరిజన సంక్షేమశాఖకు సమర్పించాలని పాలనాధికారి, ఐటీడీఏ పీవో ఆదేశించినా.. యాజమాన్యాలు చోద్యం చూస్తున్నాయి.

సమస్య పరిష్కారానికి చర్యలు..

ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌ను వివరణ కోరగా.. కళాశాలలకు లేఖలు రాశామన్నారు. వెంటనే హార్డ్‌కాపీలను సమర్పించాలని ఆదేశించామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మచ్చుకు కొన్ని..ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 393 మంది విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. హార్డ్‌కాపీలను కళాశాల యాజమాన్యం సమర్పించలేదు.

ఇచ్చోడలోని రాజరాజేశ్వర్ వృత్తి విద్యా కళాశాలలో చదువుతున్న 393 మంది విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు వారి వివరాలు, హార్డ్‌కాపీలు అందజేయలేదు. ఇవి ఉదాహరణలు మాత్రమే. జిల్లాలోని చాలా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఇదే పరిస్థితి.

# 'యాప్'దలో ఇస్తారు.. దొరికినంత దోచేస్తారు..!




మంచిర్యాల :'' నస్పూర్‌కు చెందిన ఓ యువకుడు రూపీకింగ్, రూపీబాక్స్, ప్రైం రూపీ, రూపీస్టార్, క్రెడిట్‌బస్ వంటి పలు లోన్‌యాప్‌ల ద్వారా డబ్బులు పొంది తిరిగి చెల్లించినప్పటికి మరలా చెల్లించాలని, లేకపోతే బంధువులకు, స్నేహితులకు ఫోన్లు చేస్తామని సైబర్‌క్రైం నిందితులు ఫోన్లు చేశారు.దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులకు గడిచిన కొద్దిరోజుల్లోనే జిల్లాకేంద్రంలోని ఓ యువతితో పాటు దండేపల్లి మండలానికి చెందిన యువకుడు బలవన్మరణం పొందారు. సామాన్య మధ్యతరగతి కుటుంబాల అవసరాలను సైబర్ ఆగంతకులు ఆసరాగా చేసుకుంటున్నారు. యువత లక్ష్యంగా రుణయాప్‌లను రంగంలోకి దింపుతున్నారు. అవగాహనలేమితో రుణాలు పొందుతున్న వారంతా తీరా కట్టేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారి రుణం తీసుకొని కట్టేశాక కూడా వదిలిపెట్టరు. అడగకుండానే డబ్బులు ఖాతాకి పంపిస్తుంటారు. ఇదేంటని అడిగితే మీరే రిక్వెస్ట్ పెట్టారంటూ గందరగోళానికి గురిచేసి రెట్టింపు డబ్బులు వచ్చేదాకా వేధిస్తూనే ఉంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుణయాప్‌ల నిర్వాహకులు యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారు. రుణం చెల్లించడంలో జాప్యం ఏర్పడినా, అడిగినంత చెల్లించకపోయినా వేధింపులకు గురిచేస్తున్నారు. సంక్షిప్త సందేశాలు పంపిస్తూ అసభ్యకరంగా దూషిస్తారు. చిత్రాలు మార్ఫింగ్ చేసి మోసగాడు..దొంగ అంటూ సామాజిక మాధ్యమాల్లో పెడుతారు. ఫోన్ కాంటాక్టుల్లోని నంబర్లకు రుణం తీసుకుని చెల్లించడం లేదని మేసేజ్‌లు పంపించి పరువు బజారు కీడుస్తారు.

ఎరవేసి..ఆపై దోచేసి

సైబర్ మోసాలా మాదిరి రుణయాప్‌ల నిర్వాహకులు ఆకర్షణీయమైన ప్రకటనలతో ఏమారుస్తున్నారు. ఎలాంటి ఆధారాలు అవసరం లేదని, అడిగినంత ఇస్తామని, విడతల వారీగా కట్టొచ్చని.. ఇలా రకరకాలుగా ఎరవేస్తుంటారు. యాప్ డౌన్‌లోడ్ ఉచితమని నమ్మబలికి తర్వాత అసలు కథ నడిపిస్తారు. ఫోన్ కాంటాక్టులు, గ్యాలరీ ఫొటోలు ఇతర వివరాలన్ని అనుసంధానం చేస్తారు. అలా రుణం పొందిన వారి పూర్తి వివరాలను నిర్వాహకులు తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు.

కేసు నమోదులిలా..రుణయాప్‌ల బాధితులు ఫిర్యాదు చేస్తే ఐటీ చట్టంలో చీటింగ్ కేసు కింద నమోదు చేస్తారు. యాప్ ఎక్కడి నుంచి నిర్వహిస్తున్నారు, దానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి ఉందా..లేదా..అనేది చూస్తారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రుణం తీసుకుంటే చెల్లించేందుకు 60 రోజుల గడువు ఉంటుంది. అంతలోపే అడుగుతున్నాయంటే అవి కచ్చితంగా వేధించే యాప్‌లే అని నిర్ధారణ చేసుకోవాలి. దాదాపు 90 శాతం యాప్‌లకు ఆర్‌బీఐ నుంచి ఎలాంటి అనుమతులు ఉండవు. రాష్ట్ర పోలీస్‌శాఖ పరిశోధించిన ప్రకారం చాలా యాప్‌లు చైనా నుంచి వస్తున్నట్లు గుర్తించారు. ఈ నిర్వాహకులను పట్టుకోవడం చాలా కష్టం.

పోలీసు ప్రకారం.. రుణయాప్‌ల్లో తరచూ వాడుతున్నవి..

యూపీఏ లోన్, ఫస్ట్ క్యాష్, రిచ్, లోన్‌గో, నాన్‌రూపీ, శార్స్ లోన్, స్కైలోన్, లైవ్ క్యాష్, రూపీ బాక్స్, ఎక్స్‌ప్రెస్ లోన్, క్యాష్‌అడ్వాన్స్, హలో రూపీ, హ్యాండ్‌క్యాష్, ఐ క్రెడిట్, భారత్ క్యాష్, స్మార్ట్ కాయిన్, ఈజీ లోన్, సిల్వర్ ప్యాకెట్, క్యాష్‌క్యారీ లోన్..

యాప్‌ల జోలికి వెళ్లకపోవడమే మంచిది– బిల్లా తిరుపతిరెడ్డి, మంచిర్యాల ఏసీపీ

చరవాణులకు వచ్చే అనవసరమైన సందేశాలకు స్పందించవొద్దు. ఫోన్ చేసి తాము రుణాలిస్తామంటూ నమ్మించేవారి మాటలు నమ్మి వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. రుణయాప్‌ల జోలికి అసలు వెళ్లొద్దు. ఒకవేళ వెళ్లినా వాటికి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతి ఉందా.. అని చెక్ చేసుకోవాలి. ఆకర్షణీయమైన ప్రకటనల లింక్‌లు నొక్కితే మనకు తెలియకుండానే పూర్తివివరాలు ఆగంతకుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలి. 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు.

# 'కౌలు'కోలేని బతుకులు

కౌటాల : ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకున్నా.. బ్యాంకులు రుణాలు అందించకున్నా.. వారికి తెలిసింది వ్యవసాయం ఒక్కటే. కౌలు, ఎరువుల ధరలు పెరిగినా భూమినే నమ్ముకున్న కౌలు రైతులను ఇటీవల కురిసిన భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. దీనికితోడు ఎగువ మహారాష్ట్ర వరదలు ప్రాణహిత పరివాహక కౌలు రైతులను నట్టేటముంచాయి. గంపెడాశలతో వానాకాలం సాగుకు శ్రీకారం చుట్టిన అన్నదాతలను ఆది నుంచే వర్షాలు కోలుకుండా చేశాయి. వరదలతో పొలాలు నీటమునిగి కనుచూపు మేర ఇసుక మేటలు వేసిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. జులైలో కురిసిన వర్షాలకు విత్తనాలు కొట్టుకుపోగా.. కొందరు మళ్లీ విత్తుకున్నారు. ఈక్రమంలో ఇటీవల ప్రాణహిత ఉగ్రరూపం దాల్చడంతో రెండోసారి చేన్లు నీటమునిగి ఇసుక మేటలు వేసింది. కౌటాల మండలంలోని ప్రాణహిత, పెన్‌గంగా సరిహద్దు గ్రామాలైన తాటిపల్లి, వీర్దండి, తుమ్మిడిహెట్టి, సాండ్‌గాం, వీరవెల్లి, గుండాయిపేట, జనగాం గ్రామాల రైతులు పత్తి ఎక్కువగా సాగు చేస్తుంటారు. వారిలో భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసేవారే ఎక్కువ. ఒక్కో ఎకరానికి భూ యజమానులు రూ.15వేల వరకు కౌలు తీసుకుంటున్నారు. ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో ఒక్కోరైతు కనీసం అయిదు ఎకరాల వరకు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. భారీ వర్షాలు, ప్రాణహిత వరద ముంపుతో మొదట విత్తిన పంట మొలకలన్నీ కుళ్లిపోయాయి. అప్పులు చేసి మరీ రెండోసారి గింజలు విత్తిన రైతులకు నిరాశే ఎదురైంది. ఇప్పుడు సాగుకు అదను కూడా తప్పిపోయింది. గత్యంతరం లేక భూ యజమానికి కౌలు చెల్లించడంతో పాటు కుటుంబ పోషణకు భారం కావడంతో కౌలురైతులు కూలీ పనులకు వెళుతున్నారు.నెల వ్యవధిలో మూడుసార్లు..వానాకాలం ప్రారంభంలో రైతులు పత్తి విత్తనాలు నాటారు. మొక్కలు కొంచం ఎదిగే దశకు వచ్చేసరికి జులై నెలలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో మొక్కలు కుళ్లిపోయాయి. మరోమారు వాటి స్థానంలో విత్తనాలు విత్తారు. ఇంతలో భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో ప్రాణహిత తీరం ముంపునకు గురైంది. ఒక నెల వ్యవధిలో సుమారుగా మూడుసార్లు పంటచేలు ముంపుకు గురికావడంతో పంటలన్నీ కుళ్లిపోయాయి. ఒంద్రుమేటలు, తేమతో సరిగ్గా ఎదగకపోవడం, మొలకెత్తకపోవడం వంటి సమస్యలొచ్చాయి. మూడుసార్లు విత్తనాలు వేసినందుకు దాదాపుగా రూ.లక్ష వరకు ఖర్చులు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. 28,370 ఎకరాల్లో నష్టం..సిర్పూరు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూరు, చింతలమా నెపల్లి, పెంచికల్‌పేట, సిర్పూరు, కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లో సుమారుగా 28,370 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు.

# వంతెన కూలినా.. అంతేనా..?

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు కాజ్‌వే కూలి.. రాకపోకలు స్తంభించిపోయి నెల రోజులు గడుస్తున్నా.. మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ఆ దారిగుండా వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. స్థానిక బైపాస్‌రోడ్డులో పదేళ్ల కిందట రాళ్లవాగుపై దాదాపు రూ.80 లక్షలతో కాజ్‌వే నిర్మించారు. ఆ తర్వాత ఆ కాజ్‌వేకు మరో రూ.20 లక్షలతో అప్రోచ్ రోడ్లు, కాలువలు నిర్మించారు. అప్పుడు నాసిరకంగా నిర్మించిన కాజ్‌వేతో రాళ్లవాగు ఉద్ధృతికి కొట్టుకుపోతూ వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకున్న పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, అధికారులు కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. గత నెలలో వచ్చిన రాళ్లవాగు ఉద్ధృతికి కావేజ్ కోతకు గురైంది. ఇటీవల మట్టి పోసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. మళ్లీ రాళ్లవాగులో వరద నీరు రావడంతో ఆ కాజ్‌వే మధ్యలో పూర్తిగా కూలిపోయి రాకపోకలు ఆగిపోయాయి. కాజ్‌వే కూలిపోవడంతో పాతమంచిర్యాల, వేంపల్లి, రంగపేట, ఎస్సీ కాలనీ, ఫవర్‌సిటీ, కాలనీ అండాలమ్మకాలనీ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# రక్తశుద్ధిపై.. ఏదీ చిత్తశుద్ధి?

ఆసిఫాబాద్: మూత్రపిండ(కిడ్నీ) వ్యాధిగ్రస్థులకు చికిత్స అందించేందుకు జిల్లాలో రెండుచోట్ల రక్తశుద్ధి కేంద్రాలు మంజూరు చేసిన ప్రభుత్వం.. నాలుగు నెలలు గడుస్తున్నా తదుపరి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సంబంధించిన చికిత్స జిల్లాలో ఎక్కడా లేదు. రక్తశుద్ధి కోసం వ్యాధిగ్రస్థులు తరచూ ఆదిలాబాద్ రిమ్స్, ఉట్నూర్, మంచిర్యాల, కరీంనగర్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. నెలకు మందుల కోసమే రూ.4 వేల నుంచి రూ. 5 వేలు ఖర్చు చేస్తున్నారు. దూరభారం కావడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. రెండు కిడ్నీలు చెడిపోయిన రోగులకు రక్తశుద్ధి చేయాల్సిన అవసరముంది. వీరి ఆరోగ్యం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియదు. రక్తపోటు పెరిగి సమస్య జటిలమవుతుంది. నీరసంగా ఉంటారు. తరచూ జ్వరం రావడం, వాంతులు తదితర లక్షణాలతో ఇబ్బందులకు గురవుతుంటారు. జిల్లాలో రెండు సీహెచ్‌సీలు, రెండు యూపీహెచ్‌సీలు, 20 పీహెచ్‌సీల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. వీటిలో కిడ్నీ వ్యాధి వైద్యం ఎక్కడా అందుబాటులో లేదు. జిల్లాలో ఆసిఫాబాద్, లింగాపూర్, సిర్పూర్(యు), తిర్యాణి, కాగజ్‌నగర్, వాంకిడి, బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి తదితర మండలాల్లో సుమారు 70 మంది వ్యాధిగ్రస్థులున్నారు. వీరంతా వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి కొందరు వారానికి ఒకరోజు, కొందరు రెండురోజుల పాటు రక్తశుద్ధి చేయించుకుంటున్నారు.

ఏడాది నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాకు చెందిన కొందరు అక్కడికే చికిత్సకు వెళుతున్నారు. బెజ్జూర్, కౌటాల మండలాలకు చెందిన వారు మంచిర్యాలకు వెళ్లాలంటే 120–130 కి.మీ. దూరం ప్రయాణించాలి. అంటే చికిత్స చేయించుకొని వచ్చేసరికి రెండు రోజులు పడుతుంది. జిల్లాలోనే ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తే దూరభారం తగ్గుతుంది.

నాలుగు నెలలు గడుస్తున్నా..?

జిల్లాలో కిడ్నీ బాధితుల కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తశుద్ధి కేంద్రాలు మంజూరు చేస్తూ ఏప్రిల్ 27న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో కేంద్రంలో అయిదు యంత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అందులో పేర్కొంది. దీంతో వైద్యం దగ్గరవుతుందని వ్యాధిగ్రస్థులు సంబరబడ్డారు. కానీ ఇప్పటి వరకు జిల్లాలో దీని పురోగతి ఏమీ లేదు. కేంద్రాల్లో ఏర్పాటు చేసే వైద్య పరికరాలు, యంత్రాల కొనుగోళ్ల కోసం ప్రభుత్వం టెండర్‌లు పిలవనున్నట్లు అనధికారికంగా అధికారులు చెబుతున్నారు.

అక్కడే అద్దెకుంటున్నారు..తిర్యాణి మండలానికి చెందిన మల్లాగౌడ్‌కు మూడునెలల క్రితం వ్యాధి సోకింది. కరీంనగర్ చెల్మెడ ఆనంద్‌రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారానికి రెండుసార్లు రక్తశుద్ధి చేయాల్సి ఉంది. దీంతో కుటుంబ సభ్యులతో కలసి అక్కడే అద్దెకు ఉంటున్నారు. నెలకు అద్దెకు, మందులకు కలిపి రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతున్నట్లు చెప్పారు.

తదుపరి ఆదేశాలు రాలేదు– స్వామి, ఆసుపత్రి పర్యవేక్షణాధికారి

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో రెండు రక్తశుద్ధి కేంద్రాలు మంజూరు చేస్తూ ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. కానీ అప్పటి నుంచి యంత్రాలు, ఇతరాత్ర వాటి ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి సమాచారం రాలేదు.

మూడేళ్లుగా ఇబ్బంది– కొట్రంగి సురేష్, ఎల్కపల్లిమాది బెజ్జూర్ మండలం ఎల్కపల్లి. 2019లో వ్యాధి సోకింది. మొదటి ఏడాది ప్రైవేట్‌లో వైద్య ఖర్చులు రూ.లక్ష వరకు అయ్యాయి. తర్వాత కరీంనగర్ చల్మెడ ఆనంద్‌రావు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఏడాది నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతున్నా. వారానికి రెండుసార్లు రక్తశుద్ధి చేయించుకోవాలి. వెళ్లి రావాలంటే రెండురోజులు పడుతోంది. ఉచిత ప్రయాణం, చికిత్స అందుతున్నా.. మందులకు నెలకు రూ.4–5 వేలు ఖర్చు అవుతున్నాయి.

# సమసమాజ నిర్మాణానికి పునరంకితమవుదాం: చంద్రబాబు



ఉండవల్లి: దేశ ప్రజలందరికీ తెలుగుదేశం అధినేత చంద్రబాబు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ వంటి మహనీయుల ఆదర్శాలు, ఆకాంక్షల నుంచి మన రాజ్యాంగం ఊపిరి పోసుకుందన్నారు. ఈ శుభవేళ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు, సమసమాజ నిర్మాణానికి, పేదరిక నిర్మూలనకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.

ఉండవల్లిలోని నివాసంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను చంద్రబాబు ఎగురవేశారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నివాసంలో నిర్వహించిన వేడుకల్లో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్నారు. మువ్వన్నెల జెండాకు వందనం సమర్పించారు. మహోన్నత ప్రజాస్వామ్యం, మహోజ్వలమైన చరిత్ర మనదని ఆయన అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, హక్కులను రాజ్యాంగం మనకు ప్రసాదించిందని పేర్కొన్నారు.

# జనసేన పోటీ చేసే రెండు స్థానాలను ప్రకటించిన పవన్




అమరావతి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేసే 2 స్థానాలను ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. తెదేపా 2 సీట్లు ప్రకటించినందున తానూ 2 స్థానాలను ప్రకటిస్తున్నట్లు చెప్పారు. రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తుందన్నారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో జాతీయ పతాకాన్ని పవన్ ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.."తెదేపాతో కలిసే ఎన్నికలకు వెళ్తున్నాం. ఆ పార్టీతో కలిస్తే బలవంతులమవుతాం. ఉమ్మడి మేనిఫెస్టో ఉంటుంది. పొత్తుల్లో ఒక మాట అటూ ఇటూ ఉంటుంది. ఎన్ని స్థానాలు తీసుకోవాలో నాకు తెలుసు. సీఎం జగన్‌కు ఊరంతా శత్రువులే. ఆయనపై వ్యక్తిగత కక్ష లేదు. వైకాపా నేతలకు కష్టమొస్తే నా వద్దకు రండి. పొత్తు దెబ్బతినేలా కొందరు మాట్లాడుతున్నారు. 2024లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకూడదు" అని అన్నారు.




విజయవాడ: అన్ని వర్గాల వారి కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆయన భారీ విగ్రహాలు పెడితే పేదల ఆకలి తీరదని చెప్పారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై స్పందించారు. "రాష్ట్రంలో దళితులపై దాడులు వందశాతం పెరిగిపోయాయి. దారుణంగా చంపి డోర్ డెలివరీ చేసినవారిని పక్కన పెట్టుకుంటున్నారు. అంబేద్కర్ గురించి గొప్పగా చెప్పడం కాదు.. ఆయన ఆశయాలను అమలు చేయాలి. కొందరు నియంతల్లా మారి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు. ఎస్సీ ,ఎస్టీ నిధులు దారి మళ్లించి సొంత అవసరాలకు వాడారు. దళితులపై కపట ప్రేమ చూపేవారికి తగిన బుద్ధి చెప్పాలి. ప్రాంతీయ పార్టీలు బడుగు, బలహీనవర్గాలను సమానంగా చూడటం లేదు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వని పార్టీలకు మద్దతు తెలపబోమని ప్రజలు ప్రమాణం చేయాలి

**వైఎస్ఆర్ కుమార్తెను.. వైఎస్ షర్మిల ఎందుకు కాను? :** ఎవరూ కితాబు ఇవ్వకపోతే నా విలువ ఎక్కువ కాదు.. తక్కువా కాదు. నేను వైఎస్ఆర్ కుమార్తెను అయినప్పుడు వైఎస్ షర్మిల కాకుండా ఎలా ఉంటాను. నా కుమారుడికి వైఎస్ రాజారెడ్డి అని పేరు పెట్టుకున్నా. నాకు చాలా దగ్గర మనిషి కొండా రాఘవరెడ్డి కూడా నేను అడిగి పాదయాత్ర చేశానని మాట్లాడారు. మీ ఆరోపణలు నిజం కాదని నేను ప్రమాణం చేయగలను. మీరు చేయగలరా? అక్రమంగా సంపాదించుకోవడానికి నా భర్తతో జగన్ వద్దకు వెళ్లానని అభాండాలు వేస్తున్నారు. ఇవాళ్టి వరకూ ఏదీ ఆశించి నా అన్న వద్దకు వెళ్లలేదు. దానికి సాక్ష్యం మా అమ్మే. మీకు దమ్ముంటే మా అమ్మను అడగండి" అని షర్మిల వ్యాఖ్యానించారు.




రిపబ్లిక్ డే వేడుకలు శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పలు జిల్లాల్లో అధికారులు ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. అదేవిధంగా పలు పార్టీ కార్యాలయాల్లోనూ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.




దిల్లీ: భారత గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ శుక్రవారం కీలక ప్రకటన చేశారు. మరింత ఎక్కువ మంది భారత విద్యార్థులు ఫ్రాన్స్‌లో చదువుకునే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 2030 నాటికి దాదాపు 30 వేల మంది విద్యార్థులను ఆహ్వానించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

భారత విద్యార్థులకు ఫ్రాన్స్ ఏవిధంగా తోడ్పాటునందించనుందో మెక్రాన్ వివరించారు. ఫ్రెంచ్ మాట్లాడలేని విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా 'అంతర్జాతీయ తరగతుల'ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివిధ సంస్థల భాగస్వామ్యంతో ఒక నెట్‌వర్క్‌ను సృష్టిస్తామని వివరించారు. ఫ్రాన్స్‌లో చదివిన పూర్వ విద్యార్థులకు వీసా సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. భారత్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం మెక్రాన్ ప్రత్యేక విమానంలో గురువారం జైపుర్ నగరానికి చేరుకున్నారు. శుక్రవారం దిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. గురువారం జైపుర్ శివారులోని ఆమెర్ కోటను మెక్రాన్ సందర్శించారు. ప్రధాని మోదీ ఆయనకు హస్తకళల దుకాణంలో అయోధ్య రామమందిర నమూనాను కొనుగోలు చేసి బహూకరించారు. నేతలిద్దరూ సాహూ చాయ్‌వాలా వద్ద మసాలా టీ సేవిస్తూ కబుర్లు చెప్పుకొన్నారు. తర్వాత ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు.




# అమేయ శక్తిలో 'ఆమె'.. గణతంత్ర పరేడ్‌ను నడిపించిన నారీమణులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత రిపబ్లిక్ డే పరేడ్ నిర్వహించారు. ఈ వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ మహిళా శక్తితో పాటు ప్రజాస్వామిక విలువలు ప్రతిబింబించేలా ఈ సారి పరేడ్‌ను నిర్వహించారు. చరిత్రలో తొలిసారిగా త్రివిధ దళాలకు చెందిన నారీమణులు.. మన సైనిక అమేయ శక్తిని చాటిచెప్పారు. దేశ భద్రతలో మన నారీశక్తిని వీక్షించి భారతీయులు ఉప్పొంగిపోయారు.

**జయహో... నారీ భేరి! :** 'ఆవాహన్'తో పరేడ్‌ను మొదలుపెట్టారు. ఇందులో 100 మంది మహిళలు భారతీయ సంగీతాన్ని వినిపించారు. సంప్రదాయ బ్యాండ్‌కు బదులుగా శంఖం, నాద స్వరం, నగారాతో ప్రదర్శన ఇచ్చారు. నాలుగు ఎంఐ-17వి హెలికాప్టర్లు ధ్వజ్ ఆకృతిలో విన్యాసాలు ప్రదర్శించాయి. ఈసారి పరేడ్‌లో 90 మంది సభ్యుల ఫ్రాన్స్ దళం కూడా పాల్గొంది. ఫ్రెంచ్ దళం ప్రదర్శన సమయంలో రఫేల్ యుద్ధ విమానాలు గగనతలంలో విన్యాసాలు చేశాయి. మహిళా అధికారులు దీప్తి రాణా, ప్రియాంకా సేవ్‌దా.. ఆయుధ లొకేషన్ గుర్తింపు రాడార్, పినాక రాకెట్ వ్యవస్థలకు నేతృత్వం వహించారు. చరిత్రలో తొలిసారిగా అందరూ మహిళలే సభ్యులుగా ఉన్న త్రివిధ దళాలు పాల్గొన్నాయి. ఇందులో అగ్నివీర్‌లు కూడా ఉన్నారు. ఆత్మనిర్భరత, నారీశక్తి థీమ్‌తో నౌకాదళ శకటం ఆకట్టుకుంది. ఐఎన్ఎస్ విక్రాంత్‌తో పాటు, శివాలిక్, కలవరి క్లాస్ సబ్‌మెరైన్లను ప్రదర్శించారు. దేశీయంగా తయారుచేసిన ఆయుధాలతో పాటు క్షిపణులు, డ్రోన్ జామర్లు, నిఘా వ్యవస్థలు, వాహనాలపై అమర్చే మోటార్లు, బీఎంపీ-2 సాయుధ శకటాలను ప్రదర్శించారు. ఎయిర్‌ఫోర్స్ మార్చ్‌కు స్క్వాడ్రన్ లీడర్లు రష్మీ ఠాకుర్, సుమితా యాదవ్, ప్రతిథి అహ్లువాలియా, ఫ్లైట్ లెఫ్టినెంట్ కిరిట్ రొహైల్ నేతృత్వం వహించారు. 260 మంది సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ మహిళా సైనికులు 'నారీ శక్తి' పేరుతో విన్యాసాలు చేశారు. తొలిసారి బీఎస్ఎఫ్ మహిళా బ్రాస్ బ్యాండ్ ఈ పరేడ్‌లో పాల్గొంది. 300 ఏళ్ల బాంబే శాపర్స్ రెజిమెంట్ చరిత్రలో తొలిసారిగా అందరూ పురుషులే ఉన్న బృందానికి ఒక మహిళ నాయకత్వం వహించారు. 31 ఏళ్ల మేజర్ దివ్య త్యాగికి ఈ అవకాశం దక్కింది. ఈ ఏడాది ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు అందుకున్న 19 మంది పరేడ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 16 శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శకటాలున్నాయి. వీటితోపాటు సామాజిక-ఆర్థిక కార్యకలాపాలు, శాస్త్ర సాంకేతిక రంగానికి చెందిన మహిళలు ప్రదర్శించిన 10 శకటాలు ఆకట్టుకున్నాయి.

# దౌత్యపరమైన వివాదం వేళ.. 'రిపబ్లిక్ డే' శుభాకాంక్షలు చెప్పిన కెనడా

దిల్లీ: భారత రిపబ్లిక్ డే వేడుకలు శుక్రవారం దేశమంతా ఘనంగా జరుగుతున్నాయి. ప్రపంచ దేశాలు శుభాకాంక్షలు చెప్తున్నాయి. కెనడా కూడా మనకు విషెస్ చెప్పింది. 'భారత్‌కు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ దిల్లీలోని ఆ దేశ హై కమిషనర్ కార్యాలయం హిందీ, ఇంగ్లిష్‌లో పోస్టు పెట్టింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఎన్నికల్లో విదేశీ జోక్యంపై జరుగుతోన్న దర్యాప్తులో భారత్ పేరు చేర్చి.. ట్రూడో ప్రభుత్వం ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా, ఫ్రాన్స్ తదితర దేశాల నుంచి మనకు రిపబ్లిక్ డే సందేశాలు అందాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




# 'చంద్రయాన్-3.. బాలక్ రామ్'.. పరేడ్‌లో ఆకట్టుకున్న శకటాలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర దినోత్సవాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి.

అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర లిఖిస్తూ భారత్ సాధించిన చంద్రయాన్-3 విజయం నుంచి అయోధ్యలో ఇటీవల కొలువైన బాల రామయ్య వరకూ అనేక విశేషాలను వీటిల్లో ప్రదర్శించారు. అవి సందర్శకుల మనసు దోచుకున్నాయి.

**శకటాల విశేషాలివే..** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రదర్శించిన శకటంలో చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 మిషన్లు ఆకట్టుకున్నాయి. చంద్రుడిపై మన విక్రమ్ ల్యాండర్ దిగుతున్న దృశ్యాలను ఇందులో ప్రదర్శించారు. శకటంపై ఉన్న మహిళా శాస్త్రవేత్తలు జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ దిగిన శివశక్తి పాయింట్‌ను చూపించారు. మణిపుర్ శకటం ప్రత్యేకంగా నిలిచింది. ఈ రాష్ట్రంలో 500 ఏళ్ల చరిత్ర కలిగిన 'ఇమా కెయితల్' మార్కెట్‌ను ప్రదర్శించారు. దీన్ని పూర్తిగా మహిళా విక్రేతలే నడుపుతారు. ప్రపంచంలో మహిళలు నిర్వహిస్తున్న అతిపెద్ద మార్కెట్ ఇదే కావడం విశేషం. ఉత్తరప్రదేశ్ శకటంలో రామ్ లల్లా చిత్రం ఆకట్టుకుంది. అయోధ్యలో నవనిర్మిత భవ్య రామమందిర ప్రారంభోత్సవానికి గుర్తుగా దీన్ని ప్రదర్శించారు. శకటానికి ముందు బాలక్‌రామ్ విల్లు-బాణంతో దర్శనమిచ్చారు. దీంతో పాటు ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాను చాటిచెప్పే 'కలశం', అయోధ్య దీపోత్సవ్, హైస్పీడ్ రైళ్లను ప్రదర్శించారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ శకటంలో కృత్రిమ మేధ సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఆరోగ్యం, విద్య, సామాజిక సాధికారతకు ఏఐ ఎలా ఉపయోగపడుతోందో తెలిపారు. భారత్ అధ్యక్షతన విజయవంతమైన జీ20 సదస్సును కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ తమ శకటంలో ప్రదర్శించింది. దీనిపై ఏర్పాటు చేసిన 'నమస్తే ముద్ర' ఆకట్టుకుంది. మరికొద్ది రోజుల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ.. కేంద్ర ఎన్నికల సంఘం ఈ పరేడ్‌లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పింది. ఈవీఎంలో ఓటు వేస్తున్నట్లుగా రూపొందించిన ఈ శకటం ఆకట్టుకుంది. కేంద్ర ప్రజా పనుల విభాగం శకటంలో నూతన పార్లమెంట్ భవనం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ థీమ్‌తో మహారాష్ట్ర తమ శకటాన్ని ప్రదర్శించింది.

# పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది: వెంకయ్యనాయుడు



హైదరాబాద్: ఆత్మనిర్భర్ భారత్‌గా దేశం అడుగులు ముందుకేస్తోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆ లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ రాజకీయాలు, వివాదాలను పక్కనపెట్టి ప్రభుత్వంతో చేతులు కలిపి.. సమైక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కోరారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. "ప్రపంచం మరోసారి భారత్ వైపు చూస్తోంది. అందరూ ఐక్యంగా ముందుకు సాగి దేశాన్ని శక్తిమంతంగా తయారు చేసేందుకు పాటుపడాలి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో ముందుకుపోతోంది. నాకు 'పద్మవిభూషణ్' ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది" అని వెంకయ్యనాయుడు అన్నారు.

# దేశసేవకు ప్రజలంతా పునరంకితం కావాల్సిన తరుణం: పురందేశ్వరి

విజయవాడ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ దేశసేవకు ప్రజలంతా పునరంకితం కావాల్సిన తరుణమిదని, స్వాతంత్ర్యం కోసం బలిదానం చేసిన వారిని స్మరించుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకోవాలని, ప్రధాని నరేంద్రమోదీ అంత్యోదయ స్ఫూర్తిగా అడుగులు వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో రాజ్యాంగ స్ఫూర్తి లేదని, సమసమాజ స్థాపన భావన కనిపించడంలేదని, ప్రభుత్వం ప్రజల హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని పురందేశ్వరి మండిపడ్డారు. వాక్ స్వాతంత్ర్యం అనేది రాష్ట్రంలో ఎవరికీ లేకుండా పోయిందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే జైలుకు పంపుతున్నారని, అవినీతిని ప్రశ్నిస్తే భయపెట్టి నిర్బంధాలు, వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సేవ భావన వైసీపీ పాలనలో కనిపించడంలేదన్నారు. ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి తిలోకదకాలిచ్చారన్నారు.

పద్మ అవార్డు గ్రహీతలకు, వెంకయ్యనాయుడు, చిరంజీవి, ఉమామహేశ్వరిలకు పురందేశ్వరి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం రాష్ట్రంలో కొరవడ్డాయన్నారు. సమాఖ్య వ్యవస్థలో కొన్ని రాష్ట్రాల వ్యవహారాలు దేశాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జన్సీ కొనసాగుతోందని.. ప్రజలను గాలికొదిలేశారని విమర్శించారు. మన దేశం వసుదైక కుటుంబం అనే భావనను ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచానికి చాటారని సత్యకుమార్ పేర్కొన్నారు.

# లవ్‌లీ రెబల్‌స్టార్

క్యూట్ లుక్స్.. సొగసైన అందాలతో మైమరిపించే బ్యూటీ శాన్వి శ్రీవత్సవ. ఈ కన్నడ బ్యూటీ లవ్ లీ సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది. ఆది సాయికుమార్ సరసన దర్శకురాలు బి.జయ ఈ క్యూట్ బ్యూటీని తెరకు పరిచయం చేసారు. లవ్ లీ లుక్స్ తో కుర్రకారు గుండెల్ని మెల్ట్ చేసిన శాన్వీ తొలి ప్రయత్నం ట్రెడిషనల్ గాళ్ గా కనిపించింది. ఆ తర్వాత విష్ణు సరసన ఆర్జీవీ డైరెక్షన్ లో ఎటాక్ సినిమాలో నటించింది. గ్లామర్ ఎలివేషన్ పరంగా హద్దులు చెరిపేసి చెలరేగిపోయింది. అయినా ఆ సినిమా ఆశించిన విజయం సాధించలేదు. ఆ తర్వాతి కాలంలో శాన్వీ పూర్తిగా కన్నడ పరిశ్రమకే అంకితమైంది. బహుభాషా చిత్రం శ్రీమన్నారాయణలో నాయికగా నటించి మెప్పించింది. సామాజిక మాధ్యమాల్లో ఈ భామ స్పీడ్ గానే ఉంది. ఇన్ స్టాలో నిరంతరం ఫోటోషూట్లు షేర్ చేస్తూ ఫాలోవర్స్‌ని టీజ్ చేస్తోంది. చిట్టి పొట్టి నిక్కర్లు బికినీలతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. ఇప్పటికే ఇన్ స్టాలో లక్షలాదిగా ఫాలోవర్స్ ఉన్న ఈ బ్యూటీ..లేటెస్ట్ ఫోటోషూట్ తో మరోసారి కవ్వించింది. శాన్వి తాజా ఫోటోషూట్ అభిమానుల్లోకి వైరల్ గా దూసుకెళుతోంది. వైట్



అండ్ వైట్ డిజైనర్ లుక్ లో లవ్ లీ గాళ్ ఇచ్చిన ఈ ఫోజ్ కుర్రకారు గుండెల్ని సూటిగా టచ్ చేసింది. మునుపెన్నడూ లేనంతగా శాన్విలోని రెబలిజం మరోసారి ఈ లుక్ లో బయటపడింది. వైట్ టాప్ లో శాన్వి అందచందాలు కుర్రకారుకు కిక్ ఇచ్చాయనే చెప్పాలి. వైట్ ఫ్యాంట్.. వైట్ టాప్.. వైట్ ఇన్నర్ పై బ్లేజర్ ప్రతిదీ శాన్వి అందాన్ని రెబలిజాన్ని ఎలివేట్ చేసాయనే చెప్పాలి. అలా నుదిటిన రెండు చేతి వేళ్లను ఆన్చి స్ట్రైకింగ్ గా చూస్తూ శాన్వి ఇచ్చిన ఫోజ్ రెచ్చగొడుతోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. క్యూట్ బ్యూటీ కెరీర్ ప్లానింగ్ గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. కన్నడలో అవకాశాలు అందుకుంటోంది.

త్రిశూలం – బ్యాంగ్ అనే రెండు కన్నడ చిత్రాల్లో నటించింది. బ్యాంగ్ చిత్రం గత ఏడాది ఆగస్టులో విడుదలై మిశ్రమ స్పందనలు అందుకుంది. త్రిశూలం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే శాన్వి మహావీర్యార్ చిత్రంతో మలయాళంలోను అడుగుపెట్టింది. తదుపరి ఓ వెబ్ సిరీస్ కోసం కథ వింటోందని తెలిసింది. కన్నడ సినిమా ఉగ్రం రీమేక్ తో మరాఠాలోకి ఈ భామ అడుగుపెడుతోంది. రాంతి అనేది అక్కడ టైటిల్.

## చెల్లి ఎంగేజ్మెంట్ లో సాయి పల్లవి పవర్ఫుల్ జోష్

న్యాచురల్ బ్యూటీ సాయి పల్లవి చెల్లెలు పూజా కన్నన్ పెళ్లికి సిద్ధమైన విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం సాయి పల్లవి ఇంటి వద్ద పెళ్లి సందడి వాతావరణం నెలకొంది. తన చెల్లి ఎంగేజ్మెంట్ కి సంబంధించిన పనులన్నీ సాయి పల్లవి దగ్గరుండి మరీ చూసుకుంటుంది. ఇక పూజ కన్నన్ లవ్ మ్యారేజ్ చేసుకుంటుంది. ఇంట్లో పెద్దవాళ్ళను ఒప్పించి మరి ప్రియుడితో మూడు ముళ్ళు వేయించుకునేందుకు రెడీ అయింది. ఈ క్రమంలోనే ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. ఈ విషయాన్ని పూజా కన్నన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేసింది. ఎంగేజ్‌మెంట్ సెలబ్రేషన్స్ మొదలయ్యాయని చెబుతూ కొన్ని ఫొటోలను సైతం షేర్ చేసింది. ఇక ఇప్పుడు తాజాగా తన చెల్లెలి ఎంగేజ్మెంట్ వేడుకలో సాయి పల్లవి డాన్స్ చేస్తున్న ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా అంతటా వైరల్ గా మారింది. సాయి



పల్లవి ఎంత మంచి డాన్సరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆమె డాన్స్ కే సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. స్క్రీన్ పై తన డాన్స్ తో ఆడియన్స్ ని ఆకట్టుకున్న సాయి పల్లవి తాజాగా తన చెల్లెలు పూజా కన్నన్ ఎంగేజ్మెంట్ వేడుకలో ఫ్యామిలీ మెంబర్స్ అందరితో కలిసి డాన్స్ చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ఫ్యాన్స్ తో పాటు నెటిజన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇక ఈ వీడియోలో సాయి పల్లవి ఎంతో పద్ధతిగా లైట్ గ్రీన్ కలర్ శారీ కట్టుకొని సరదాగా డాన్స్ చేస్తూ కనిపించింది. దీంతో ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కాగా పూజా కన్నన్ పెళ్లి చేసుకోబోయే అబ్బాయి పేరు వినీత్. కొన్నాళ్ళు తన బాయ్ ఫ్రెండ్ తో ప్రేమలో ఉన్న పూజా.. రీసెంట్ గా పొంగల్ సందర్భంగా బాయ్‌ఫ్రెండ్ వినీత్‌ను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పరిచయం చేసింది. తమ పెండ్లికి పెద్దలు ఒప్పుకున్నారని.. త్వరలోనే తమ పెళ్లి కూడా జరగనున్నట్లు హింట్ ఇచ్చింది. ఇక సాయి పల్లవి విషయానికి వస్తే.. ప్రస్తుతం తెలుగులో నాగచైతన్య సరసన 'తండెల్' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో మరోసారి పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించబోతోంది. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గీత ఆర్ట్స్ బ్యానర్ పై బన్నీ వాసు, అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు.




# రాజా సాబ్.. ఎంతవరకు వచ్చిందంటే..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం కల్కి సినిమాతోపాటు రాజా సాబ్ అనే మరో సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్ సీక్వెల్ ను కూడా త్వరలోనే మొదలుపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టును చాలా వేగంగా పూర్తి చేయాలని ఆలోచనతో ఉన్నారు. గత ఏడాది డిసెంబర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సలార్ సినిమా మొదటి పార్ట్ ఏ రేంజ్ లో సక్సెస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందుకే ఆలస్యం చేయకుండా సీక్వెల్ కూడా ఇదే వేడిలో మొదలుపెట్టి వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నారు. ఇక మరొకవైపు ప్రభాస్ కల్కి సినిమా షూటింగ్ కూడా చివరి దశకు చేరుకుంటుంది. అయితే ఈ ప్రాజెక్టు ను అనుకున్న ప్లాన్ ప్రకారం ఇదే ఏడాది మే నెలలో విడుదల చేయాలి. కానీ కొన్ని పోస్ట్ ప్రొడక్షన్ పనుల వలన సినిమాను వాయిదా వేసే అవకాశాలు కనిపిస్తూ ఉన్నాయి. మరోవైపు లిస్టులో మారుతి దర్శకత్వంలో ప్రభాస్ రాజా సాబ్ అనే సినిమా చేస్తున్నాడు. హారర్ ప్లస్ కామెడీ ట్రెండ్ లో రాబోతున్న ఈ సినిమాకు కూడా ప్రమోషన్స్ గట్టిగానే చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇక ప్లాన్ ప్రకారం అయితే ఈ సినిమా షూటింగ్ అక్టోబర్ లోపు ఫినిష్ చేయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతానికైతే 40 శాతానికి పైగా షూటింగ్ పూర్తయింది. ఇక ఎక్కువగా అయితే లోకల్ లో నిర్మించిన భారీ సెట్లలోనే ఈ సినిమాను షూట్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. మారుతి అనుకుంటే మాత్రం అనుకున్న సమయానికంటే ఈ సినిమా షూటింగ్ ముందుగానే అయిపోవచ్చు. ఇక రిలీజ్ టార్గెట్ టెన్షన్ లేకుండానే రాజా సాబ్ టీం షూటింగ్లో పనుల్లో బిజీ అయినట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాను అయితే ఇదే ఏడాది డిసెంబర్లో విడుదల చేసే ఆలోచనలకు కూడా ఉన్నారు. అన్ని అనుకున్నట్టు జరిగితే రాజా సాబ్ సినిమా సలార్ మాదిరిగానే సెంటిమెంట్ గా డిసెంబర్ లో భారీ స్థాయిలో విడుదల కావచ్చు. ఎందుకంటే అప్పుడు పోటీగా బాలీవుడ్ నుంచి కూడా పెద్దగా సినిమాలు ఏమీ రావడం లేదు. కేవలం అక్షయ్ కుమార్ వెల్కమ్ 3 మాత్రమే విడుదల కానుంది. అయితే సౌత్ ఇండియాలో మాత్రం ఆ సినిమాతో ఎలాంటి పోటీ ఉండదు. ఇది మారుతి సినిమా కాబట్టి బాలీవుడ్ వాళ్ళు ఎలా రిసీవ్ చేసుకుంటారో సినిమా వచ్చే వరకు ఎవరు ఉహించలేరు. కానీ కామెడీ ప్లస్ హారర్ సినిమాలు క్లిక్ అయితే మాత్రం కలెక్షన్స్ హై రేంజ్ లో ఉంటాయని చెప్పవచ్చు. మరి ప్రభాస్ లక్కు ఎలా ఉంటుందో చూడాలి.

# దేవర : హీరోయిన్ రోల్ రూమర్స్.. క్లారిటీ..!



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమాపై పాన్ ఇండియా రేంజ్ లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత ఎన్టీఆర్ క్రేజ్ విపరీతంగా పెరిగింది. అందుకు తగ్గట్లుగా ఈ సినిమాను దర్శకుడు కొరటాల శివ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందిస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెల్సిందే. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన మిర్చి సినిమాలో మినహా మరే సినిమాలో కూడా హీరోయిన్స్ కు పెద్దగా ప్రాముఖ్యత లేదు. కనుక దేవర సినిమాలో కూడా జాన్వీ కపూర్ పాత్ర గురించి పెద్దగా ప్రాముఖ్యత ఉండదు అనే టాక్ వినిపించింది. తాజాగా హీరోయిన్ పాత్ర గురించి జరుగుతున్న ప్రచారం పై చిత్ర యూనిట్ సభ్యులు క్లారిటీ ఇచ్చారు. కథ లో అత్యంత కీలకమైన పాత్రలో జాన్వీ కపూర్ కనిపించబోతుంది. సినిమాలో ఫుల్ లెంగ్త్ రోల్ లో జాన్వీ ఉంటుంది అంటూ మేకర్స్ నుంచి ఒక అనధికారిక లీడ్ బయటకు వచ్చింది. జాన్వీ కపూర్ ఇన్నాళ్లు కమర్షియల్ హిట్స్ ను అందుకోలేక పోయింది. దేవర సినిమాతో ఆమెకు కమర్షియల్ గా బిగ్గెస్ట్ సక్సెస్ దక్కడంతో పాటు, నటనకు కూడా మంచి ఆస్కారం ఉన్న పాత్ర చేస్తున్న కారణంగా నటిగా కూడా జాన్వీ కపూర్ కి ఒక మంచి సినిమాగా దేవర నిలుస్తుందనే నమ్మకంను యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

మరి వారు చెప్పినట్లుగా దేవరలో జాన్వీకి అంత ప్రాముఖ్యత ఉంటుందా అనేది తెలియాలి అంటే ఏప్రిల్ లో సినిమా విడుదల అయ్యే వరకు వెయిట్ చేయాల్సిందే.

## అనుపమ గ్లామర్ డోస్.. టాటూతో మైండ్ బ్లాక్

చూడగానే అందమైన చిరునవ్వుతో ఆకట్టుకునే క్యూట్ హీరోయిన్స్ లలో అనుపమ పరమేశ్వరన్ కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. ఈ బ్యూటీ సినిమాలతో కంటే ఈ మధ్య ఫోటోషూట్స్ తోనే కుర్రాళ్ళ మనసును ఎక్కువగా దోచేస్తోంది. సోషల్ మీడియాలో ఏమాత్రం టైమ్ దొరికినా కూడా తన గ్లామరస్ ఫోటోలతో అందాలతో మాయ చేస్తోంది. ఇటీవల కాలంలో అమ్మడు ఒక్కసారిగా తన ఫాలోవర్స్ సంఖ్యను కూడా పెంచుకుంది. ఇక అనుపమ పరమేశ్వరన్ హై గ్లామరస్ పాత్రలు చేస్తే మాత్రం మామూలుగా ఉండదు అనేలా దర్శనమిస్తోంది. రీసెంట్ గా అమ్మడు ఒకవైపు ట్రెడిషన్ ను హైలెట్ చేస్తూనే మరొకవైపు తన గ్లామర్ ను కూడా ఎలివేట్ చేసింది. అందమైన చీరలో అను పాప టాప్ లో తన టాటూ హైలెట్ అయ్యేలా దర్శనమిచ్చింది. అంతేకాకుండా నడుము అందాలు మరింత హైలైట్ అయ్యే విధంగా మరొక స్టిల్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన ఓ వర్గం ఫ్యాన్స్ అయితే నిజంగా నమ్మలేకపోతున్నాము అంటూ



ఆమె అందాలను పొగిడేస్తున్నారు. ఇక అనుపమ పరమేశ్వరన్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 9 ఏళ్ళు పూర్తయింది. అయితే ఈ తొమ్మిదేళ్ల కాలంలో సక్సెస్ ఫెయిల్యూర్ తో సంబంధం లేకుండా అవకాశాలు అయితే అందుకుంటుంది. గత ఏడాది ఆమె ఐదు సినిమాల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అందులో ముఖ్యంగా కార్తికేయ 2 బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం కూడా ఈ బ్యూటీ చేతిలో మంచి సినిమాలు ఉన్నాయి. అందులో ఏది సక్సెస్ అయినా కూడా మరొక రేంజ్ కు వెళుతుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా టిల్లు స్క్వేర్ క్రేజీ ప్రాజెక్టు పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అలాగే మాస్ మహారాజా రవితేజ ఈగల్ సినిమా ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాపై కూడా పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అవుతున్నాయి. ఇక లిస్టులో మరొక మలయాళం సినిమా కూడా ఉంది. ఇక తెలుగులో మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక రాబోయే టిల్లు స్క్వేర్ – ఈగల్ సినిమాలు మంచి సక్సెస్ అయితే మాత్రం అనుపమ మరో లెవెల్లో ఆఫర్స్ అందుకునే అవకాశం ఉంటుంది. చూడాలి మరి పాప లక్కు ఎలా మారబోతుందో.

## ఖుషి కపూర్.. స్టన్నింగ్ గ్లామర్ ట్రీట్

అతిలోక సుందరి శ్రీదేవి ఇద్దరు కుమార్తెలు కూడా ఇప్పటికే సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టేశారు. పెద్ద అమ్మాయి జాన్వీ కపూర్ ఒక వైపు స్టార్ హీరోయిన్ గా దూసుకుపోతున్న సమయంలో శ్రీదేవి చిన్న కూతురైన ఖుషీ కపూర్.. ఇటీవలే అరంగేట్రం చేసింది. ఆమె నటించిన.. ది ఆర్చీస్ గతేడాది డిసెంబర్ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఖుషీ కపూర్ రెండో మూవీ కూడా తాజాగా ఫిక్స్ అయింది. సీనియర్ నటుడు సైఫ్ అలీఖాన్ కొడుకు ఇబ్రహీం అలీఖాన్ సరసన నటించనుంది. మొదట్లో ఈ చిత్రానికి కరణ్ జోహార్ నే దర్శకత్వం వహిస్తారనే ఊహాగానాలు వచ్చాయి. కానీ ఆయన స్టూడెంట్ శౌనా గౌతమ్ కెప్టెన్ బాధ్యతలు తీసుకున్నట్టు తెలుస్తోంది. రొమాంటిక్ కామెడీ జానర్ ఈ మూవీ తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే ఖుషీ కపూర్ అక్క జాన్వీ.. ఓ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తూ ఆకట్టుకుంటోంది. త్వరలోనే దేవర సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. అయితే జాన్వీకి ఏమాత్రం తగ్గకుండా ఖుషీ కపూర్ కూడా స్కిన్ షో



చేస్తోంది. అప్పుడప్పుడు బోల్డ్ లుక్ లో కనిపిస్తూ కుర్రకారు మతులను పోగొడుతోంది. ట్రెండీ ఔట్ ఫిట్స్ లో హొయలు ఒలికిస్తుంటోంది. తాజాగా ఖుషీ కపూర్ పోస్ట్ చేసిన పిక్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. సెల్ఫీలను షేర్ చేస్తూ లవ్ ఎమోజీని క్యాప్షన్ గా ఇచ్చింది. ఫస్ట్ రెండు పిక్స్ లో గోల్డెన్ గౌనులో కొంటె చూపులతో అట్రాక్ట్ చేస్తోంది. మరో ఫొటోలో నైట్ ఔట్ ఫిట్ లో ఫిట్ బాడీతో ఫిదా చేసింది. సైడ్ యాంగిల్ లో నడుము అందాలు చూపిస్తూ ఆకట్టుకుంటోంది. మిగతా పిక్స్ లో రిలాక్స్ మోడ్ లో ఉన్నట్లు కనిపించింది. ముద్దుగుమ్మ ఖుషీ కపూర్ మెల్ల మెల్లగా అందాల ఆరబోత విషయం లో జాన్వీ కపూర్ ను మ్యాచ్ చేసేందుకు ట్రై చేస్తుందని నెటిజన్లు చెబుతున్నారు. అక్కను మించిన చెల్లి కాబోతుందని జోస్యం చెబుతున్నారు. కెరీర్ లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. ఫొటోలు అదిరిపోయాయంటూ లైకులు కొట్టేస్తున్నారు. నటిగా కంటే కూడా టెక్నీషియన్ గా సినీ ఇండస్ట్రీలో ఎక్కువ అనుభవాన్ని దక్కించుకుంది ఖుషీ కపూర్. త్వరలోనే రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్ గా వరుస సినిమాల్లో నటించాలని ఆశ పడుతోంది. బాలీవుడ్ లోనే కాకుండా సౌత్ నుంచి ఆఫర్ లు వస్తే తప్పకుండా నటిస్తానంటూ చెబుతోంది. మరి ఖుషీ టాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడుంటుందో చూడాలి.






దిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత్‌కు రష్యా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపింది. ప్రముఖ బాలీవుడ్ నటుడు సన్నీ దేఓల్ నటించిన 'గదర్' చిత్రంలోని ఓ హిట్ సాంగ్‌కు రష్యా ఎంబసీ ఉద్యోగులు ఆడిపాడారు. ఈ వీడియోను న్యూదిల్లీలోని మాస్కో దౌత్య కార్యాలయం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. "గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. భారత స్నేహితులకు ఈ అమృత్ కాల్ మరింత ప్రకాశవంతంగా ఉండాలి. రష్యా-భారతీయ దోస్తీ కలకాలం వర్ధిల్లాలి" అని ఆ దేశ రాయబారి డెనిస్ అలిపోవ్ పోస్ట్ చేశారు.

## చాలా సంతోషంగా ఉంది... రేవంత్ ప్రభుత్వంపై జానారెడ్డి ప్రశంసలు

హైదరాబాద్, జనవరి 26: రేవంత్ రెడ్డి సర్కార్ నెలరోజుల పాలను విజయవంతంగా పూర్తి చేసుకుని ముందుకు సాగుతోంది. ఈనెలరోజుల్లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలులోకి తీసుకువచ్చింది. అలాగే మిగిలిన ఐదు గ్యారెంటీలను వీలైనంత త్వరగా ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇదిలా ఉండగా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెల రోజుల పాలనపై కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. నెలరోజుల పాలన చూస్తుంటే.. సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం.. ప్రజా పాలన ఒరవడితో ముందుకు వెళుతోందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల మధ్యన ఉందన్న భావన కల్పిస్తుందన్నారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని.. మేధావులు, ప్రజాసంఘాల, పార్టీల సలహాలు.. సూచనలు తీసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. రేవంత్ ప్రభుత్వం.. గత పరిస్థితులను వివరిస్తూ, సమస్యలు అధిగమించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు రాత్రింబవళ్ళు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

**ఆనాడే చెప్పా.. అదే నిజమైంది..** "ఈ ప్రజాపాలనలో నా వంతు పాత్ర నిర్వహిస్తాను. గతంలో నేను నాయకత్వం వహించినప్పటికీ.. ఇప్పుడు పార్టీ కార్యకర్తగా పనిచేస్తాను. నా పనితీరు ప్రతీకార్యకర్తకు ఆదర్శంగా ఉండేలా పనిచేస్తా. నా అనుభాన్ని, సలహాలను ప్రభుత్వానికి, ప్రజలకు ఇవ్వడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. బీఆర్ఎస్ ప్రభుత్వంపై నేను పదేళ్ల కింద చెప్పినవే ఇప్పుడు నిజమయ్యాయి. అప్పులు, హామీలు, సంస్కారం, ప్రజాస్వామ్యం, పతకాలపై గత ప్రభుత్వాన్ని.. నేను అనాడే హెచ్చరించాను. అప్పులు, విద్యుత్ కొనుగోళ్ళు భవిష్యత్‌కు ప్రమాదమని నేను చెప్పింది నేడు నిజమైంది" అని అన్నారు.

**సోనియమ్మకు కానుకగా ఇద్దాం...** కాంగ్రెస్ ప్రభుత్వంలో రిపబ్లిక్ డే వేడుకలు జరుపుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నాను. కాంగ్రెస్‌ను గెలిపించి.. ప్రజలు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రుణం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రతి కార్యకర్త చేసిన కృషి అద్వితీయమని కొనియాడారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచేలా.. ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. అత్యధిక స్థానాలు గెలిచి సోనియా గాంధీకి కానుకగా ఇద్దామన్నారు. ప్రజలందరికీ జానారెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ (టీఎస్పీఎస్సీ) చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రిపబ్లిక్ వేడుకల్లో భాగంగా టీఎస్పీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డిని సభ్యులుగా మరో నలుగురిని ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నియామకాలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెంటనే ఆమోదం తెలపడంతో చైర్మన్, సభ్యుల బాధ్యతల స్వీకరణకు లైన్ క్లియరైంది. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టీఎస్పీఎస్సీకి కొత్త చైర్మన్, సభ్యులను ప్రభుత్వం త్వరితగతిన నియమించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీఎస్పీఎస్సీ పరీక్షల పదేపదే వాయిదాలతో పాటు, పేపర్ లీకేజీల వివాదాల్లో ఇరుక్కున్న విషయం తెలిసిందే.



## స్పీకర్ గడ్డం ప్రసాద్, తమ్మినేనికి సీఎం రేవంత్ పరామర్శ

హైదరాబాద్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. ఇటీవల గడ్డం ప్రసాద్ అనారోగ్యానికి గురి కావడంతో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ్మినేని వద్దకు వెళ్లి మాట్లాడారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నామినేటెడ్ ఎమ్మెల్సీలు.. గవర్నర్‌కు ఇప్పుడు రాజకీయ నేపథ్యం కనిపించలేదా?: కేటీఆర్



హైదరాబాద్: గవర్నర్ రాష్ట్ర ప్రజలకు బాధ్యులే గానీ.. సీఎం రేవంత్ రెడ్డికి కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. రిప్లబిక్ డే సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ వ్యవహరిస్తున్న పక్షపాత తీరును ప్రజలంతా గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన దాసోజు శ్రవణ్, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణను భారాస ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తే.. రాజకీయపరమైన సంబంధాలు ఉన్నాయని అభ్యర్థిత్వాలను తిరస్కరించారని ఆక్షేపించారు. ఇప్పుడు ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న కోదండరామ్ పేరును ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. "నాడు కనిపించిన రాజకీయ నేపథ్యం ఇవాళ ఎందుకు కనిపించలేదు?. కాంగ్రెస్, భాజపాకు ఉన్న ఫెవికాల్ బంధంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారా?" అని ప్రశ్నించారు. సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలని.. పర్సన్ ఇన్‌ఛార్జులను పెట్టొద్దని కేటీఆర్ కోరారు. 'ప్రజాపాలన' అంటే ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులే చేయాలన్నారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు పరిపాలనా సమయం పోయిందని, పదవీకాలాన్ని ఆర్నెళ్లు లేదా ఎన్నికలు నిర్వహించే వరకు పొడిగించాలన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో కాంగ్రెస్, భాజపా మధ్య ఉన్న రహస్య మైత్రి బయటపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడినే సిఫారసు చేస్తే గవర్నర్ ఆమోదించారని విమర్శించారు. న్యాయ సూత్రాలు, రాజ్యాంగ సంప్రదాయాలు అన్ని పార్టీలకు ఒకే రకంగా ఉండాలన్నారు.

## 28న తెలంగాణకు అమిత్‌షా.. ఒకే రోజు 3 జిల్లాల్లో పర్యటన



హైదరాబాద్: తెలంగాణలో ఈ నెల 28న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన ఖరారైంది. మధ్యాహ్నం 1:05 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన బేగంపేట విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి నేరుగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించే పార్టీ క్లస్టర్ సమావేశానికి హాజరవుతారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భాజపా శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. 3:55 గంటలకు కరీంనగర్‌కు వెళ్లి కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారు.

అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో భాజపా నిర్వహించే మేధావుల సమావేశానికి ముఖ్యఅతిథిగా అమిత్‌షా హాజరవుతారు. ఈ సమావేశంలో పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఆపై బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7:45 గంటలకు బయల్దేరి దిల్లీకి వెళ్తారు.

## కేసీఆర్ అడుగుజాడల్లో సీఎం రేవంత్.. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శలు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై భారతీయ జనతా పార్టీ విమర్శించింది. బీఆర్ఎస్ పాలనలో ఉన్నట్లే ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే వేడుకల్లో చింతా సాంబమూర్తి, కాశం వెంకటేశ్వర్లు, బండా కార్తీక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మణ్ ఏమన్నారంటే..?** 'ప్రధాని మోదీ మందు చూపుతో దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా దేశంలో మోదీ పాలన సాగుతుంది. కాంగ్రెస్ హయాంలో మాత్రం దళారి పాలన కొనసాగింది. తెలంగాణ రాష్ట్రంలో గ్యారెంటీ, ఉచితల పేర్లతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. పేదలకు శాశ్వత ప్రయోజనం కల్పించాలనే చిత్తశుద్ధి ఆ పార్టీకి లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ చేయలేని పనులను బీజేపీ చేసి చూపించింది. 33 శాతం మహిళ రిజ్వేషన్లు , అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపట్టిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుంది. తెలుగు తేజాలకు పద్మ భూషణ్, పద్మవిభూషణ్ అవార్డు వరించడంలో ఎవరి సిఫారసు లేదు. యాభై రోజుల రేవంత్ రెడ్డి పాలన కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తున్నట్టు అనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్ర పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని' లక్ష్మణ్ సీఎం రేవంత్ పాలనను విమర్శించారు.

## న్యాయసూత్రాలు, రాజ్యాంగ సాంప్రదాయాలు అన్ని పార్టీలకు ఒకేలా ఉండాలి: హరీశ రావు



సిద్దిపేట: కాంగ్రెస్, బీజేపీల రహస్య మైత్రి మరోసారి బయపటపడిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంతో ఇరు పార్టీల మధ్య ఉన్న అవగాహన బట్టబయలైదని విమర్శించారు. బీజేపీ అజెండా మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మేలు చేసేలా గవర్నర్ తమిళిసై పనిచేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన అభ్యర్థులను పార్టీల్లో ఉన్నారంటూ ఎమ్మెల్సీలుగా నియమించేందుకు గవర్నర్ నిరాకరించారని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ ఏకంగా ఒక పార్టీ అధ్యక్షుడిని సిఫారసు చేస్తే ఆమోదించారని తెలిపారు. ఇది ద్వంద్వ నీతి కాదా, కాంగ్రెస్ అనుకూలంగా వ్యవహరించడం కాదా అని ప్రశ్నించారు. గతంలో క్రీడా, సాంస్కృతిక, విద్యా, సామాజిక, సేవా రంగాల్లో కృషి చేసిన వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసింది. అప్పుడు రాజకీయ కారణాలతో ఆమెదించలేదు. ఇప్పుడు ఎందుకు ఆమెదించారని వెల్లడించారు. న్యాయసూత్రాలు, రాజ్యాంగ సాంప్రదాయాలు అన్ని పార్టీలకు ఒకేరకంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ గవర్నర్ తేడా చూపిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీఆర్ఎస్‌ను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కుట్రలో గవర్నర్ భాగస్వామి కావడం దురదృష్టకరమని చెప్పారు.

## అందరూ మీలాగా అనుకుంటే ఎట్లమ్మా?.. కవితకు కౌంటర్



జగిత్యాల, జనవరి 26: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం భయపెడుతుందని అనడం వాళ్ళ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కవిత వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవుపలికారు. బీఆర్ఎస్ చేసినట్టు కాంగ్రెస్ చెయ్యదని స్పష్టం చేశారు. ఎవరు ఎవరికి ఫ్రెండ్లీ పోలీస్...? కవిత సమాధానం చెప్పాలన్నారు. "అధికారం, ప్రతిపక్షం రెండు చేసినం.. అందరూ మీలాగా అనుకుంటే ఎట్లమ్మా? నేను కక్ష్య పూరీతంగా వ్యవహరిస్తే పరిస్థితి ఇలా ఉండేది కాదు. చదవలసిన చరిత్ర చాలా ఉంది. ఇప్పుడే ఉలిక్కిపడితే ఎలా? 2014కు ముందు మీరు, ఆ తరవాత మీరు అనేది కూడా చూపిస్తాం" అంటూ జీవన్ రెడ్డి సెటైరికల్ కామెంట్స్ చేశారు.

## లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలు గెలుస్తాం: మంత్రి ఉత్తమ్



సూర్యాపేట: గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ ప్రారంభించామని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొని.. దర్గా అభివృద్ధికి రూ.కోటి ప్రకటించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల తర్వాత భారాస మరింత బలహీనమవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 లోక్‌సభ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భారాస ఒకట్రెండు స్థానాలకే పరిమితమవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు.

## ఆకట్టుకున్న తెలంగాణ శకటం.. థీమ్ చూస్తే అదుర్స్




ఢిల్లీ: దేశ వ్యాప్తంగా 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనికుల కవాతు, శకటాల ప్రదర్శన జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి తదితర అంశాలను చూపిస్తూ శకటాల ప్రదర్శన జరిగింది. తెలంగాణకు చెందిన శకటం విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ పోరాట యోధుల థీమ్‌తో దీన్ని రూపొందించారు. %Democracy at the grassroots: The Legacy of Telanganas Freedom Fighters అనేది థీమ్. పల్లెటూరు వాతావరణాన్ని ప్రతిబింబించేలా డిజైన్ ఉంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com